కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ మంగళవారం 20 మే 2025

సంపుటి: 15, సంచిక: 43, పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


ఆశ్రయమివ్వడానికి...

## భారత్ ధర్మసత్రం కాదు

శ్రీలంక శరణార్థి అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీం



2

కాల్పుల విరమణలో

## అమెరికా పాత్ర శూన్యం

పార్లమెంటరీ కమిటీకి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వివరణ



2

## సోషల్ మీడియాలో...

# సన్నాసుల ప్రచారం

## ఊరికో ఇద్దరు సన్నాసులు ఉంటే ఊరు చెడిపోతుందా!

- ఇందిరా గాంధీ లాంటి పౌరుషం ఉన్న ప్రధాని దేశానికి కావాలి
- 50 ఏండ్ల తర్వాత కూడా ప్రతి ఒక్కరి గుండెల్లో ఇందిరమ్మ ఉంది
- పెహల్గాం దాడి తర్వాత.. ఇందిరమ్మ లాంటి ప్రధాని కావాలని కోరుతున్నారు
- 'ఇందిర సౌర గిరి జల వికాసం' ప్రారంభ సభలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు



**అచ్చంపేట, మే 19 (నిఘా న్యూస్):** దేశానికి ఇందిరా గాంధీ లాంటి పౌరుషం ఉన్న ప్రధాని కావాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 50 ఏండ్ల తర్వాత కూడా ప్రతి ఒక్కరి గుండెల్లో ఇందిరమ్మ ఉందన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని సీఎం ప్రారంభించారు. 'నల్లమల డిక్లరేషన్'ను సైతం ఆవిష్కరించారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు చేపడతామని తెలిపారు. అనంతరం ఇదిరా గాంధీ గురించి మాట్లాడారు. "దేశానికి ఇందిరా గాంధీ లాంటి పౌరుషం ఉన్న ప్రధాని కావాలి. 50 ఏండ్ల తర్వాత కూడా ప్రతి ఒక్కరి గుండెల్లో ఇందిరమ్మ ఉంది. పెహల్గం దాడి తర్వాత.. ఇందిరమ్మ లాంటి ప్రధాని కావాలని ప్రజలు కోరుతున్నారు. ఇందిరా గాంధీ పాకిస్థాన్ ను రెండుగా చీల్చి.. నిటారుగా నిలబడింది." అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.

అనంతరం.. రాష్ట్రంలోని ప్రతిపక్షాలపై సీఎం రేవంత్ ఫైర్ అయ్యారు. సోషల్ మీడియాలో ఆ సన్నాసులు చేసే తప్పుడు ప్రచారం తనకు ..మిగతా 2లో



పథకాల అమలులో

## పారదర్శకత ముఖ్యం

క్షేత్రస్థాయిలో ప్రజలకు పథకాలు చేరాలి

కార్యక్రమాల అమలుకు మళ్లీ ఆకస్మిక తనిఖీలు

సమీక్షలో అధికారులతో సిఎం చంద్రబాబు

**అమరావతి మే 19 (నిఘా న్యూస్):** పథకాల అమలుతీరును, అధికారుల పనితీరును బేరీజు వేస్తానని, ఇందుకోసం మళ్లీ ఆకస్మిక తనిఖీలు తప్పవని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. వచ్చే నెల 12 నుంచే ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై సీఎం సమీక్షించారు. ప్రజా సేవ పథకాల అమలు, సంక్షేమ పథకాల పూర్తిస్థాయి సంతృప్తి ఇంకా కనిపించాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సేవల అమలుపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రేషన్, దీపం-2, ఆర్టీసీ, పంచాయతీ సేవలపై అభిప్రాయాలను పరిశీలించారు. పథకాలు, పౌరసేవలపై జూన్ 12 తర్వాత ఆకస్మిక తనిఖీ ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే సేవల్లో ప్రజలకు పూర్తిస్థాయి సంతృప్తి ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ..మిగతా 2లో

అగ్ని ప్రమాద బాధితులకు

## అండగా ఉంటాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

క్షతగాత్రులకు ఓదార్పు.. సంఘటనపై ఆరా

మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు ఇవ్వాలని డిమాండ్



**హైదరాబాద్ మే 19 (నిఘా న్యూస్):** హైదరాబాద్: చార్మినార్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన వారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. సోమవారం క్షతగాత్రులను పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు కేటీఆర్ ముందు కన్నీరు పెట్టుకోగా వారిని ఓదార్చారు. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదంలో బాధితులు సర్వం కోల్పోయారని, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తూ.. ఐదు లక్షలు కాకుండా రూ. 25 లక్షలు పరిహారం ఇవ్వాలని, అవి వారి ఇంటిని, వ్యాపారాన్ని పున:నిర్మించుకోవడానికి ఉపయోగపడుతాయని అన్నారు.అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు, ఫైర్ ఇంజన్‌లో నీళ్లు ఉంటే ..మిగతా 2లో



అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ

# పుష్కరాలపై లేదా?

## రేవంత్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి ప్రశ్నల వర్షం

**కాళేశ్వరం, మే 19 (నిఘా న్యూస్):** రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ సరస్వతి పుష్కరాల నిర్వహణపై లేకుండా పోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు రూ.35కోట్లు మాత్రమే కేటాయించారని, ఆ నిధులు ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో మహాకుంభమేళా సందర్భంగా 50 కోట్ల మంది భక్తులకు తమ ప్రభుత్వం అద్భుతమైన ఆతిథ్యం ఇచ్చిందని, కాళేశ్వరం పుష్కరాలకు విచ్చేసే 50 లక్షల మందికి రేవంత్ ప్రభుత్వం సరైన ఆతిథ్యం ఇవ్వలేకపోతోందని అసహనం వ్యక్తం చేశారు. పుష్కరాల నిర్వహణలో రేవంత్ ప్రభుత్వం విఫలమవుతోందని బండి సంజయ్ విమర్శలు చేశారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఉండి ఉంటే దక్షిణాది మొత్తానికి సరస్వతి పుష్కరాలను పండుగగా నిర్వహించే వాళ్లమని చెప్పుకొచ్చారు బండి సంజయ్. అందాల పోటీలను నిర్వహించడానికి అభ్యంతరం లేదని... కానీ ఆధ్యాత్మిక పుష్కరాలను పట్టించుకోకపోవడం ..మిగతా 2లో



కాళేశ్వరం కమిషన్ గడువు

## పొడిగింపు

**హైదరాబాద్ మే 19 (నిఘా న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టు విఆరణ కమిషన్ గడువును ప్రభుత్వం మరో మారు పొడిగించింది. కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. మరో రెండు నెలలపాటు- గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జులై నెలాఖరు వరకు గడువు పెంచుతున్నట్లు పేర్కొంది. ఇటీ-వల ఈ కమిషన్ విచారణను పూర్తి చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదికను అందించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు ..మిగతా 2లో



శ్రీవారి తులాభారంలో

రోజుకు 10 లక్షల

## దోపిడీ

శ్రీవారి సొమ్మును వాటాలుగా పంచుకున్నారు


ఐదేళ్లలో జరిగిన అరాచకాలపై విచారణ జరపాలి: భాను ప్రకాష్ రెడ్డి

డిక్లరేషన్లు కాదు..

## డెడికేషన్ కావాలి

గతంలో ప్రకటించిన డిక్లరేషన్లు ఏమయ్యాయి

కాంగ్రెస్ నల్లమల డిక్లరేషన్‌పై హరీష్ విమర్శలు



2

## ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం

జంగారెడ్డిగూడెం మరణాలపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

**అమరావతి మే 19 (నిఘా న్యూస్):** 2022లో వైఎస్సార్సీపీ హయాంలో ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెంలో జరిగిన కల్తీ మద్యం మరణాలపై కూటమి ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. ముగ్గురు అధికారులతో స్పెషల్ టస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిషోర్ నేతృత్వంలో విచారణ చేపట్టనున్నారు. అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్ ప్రభు కుమార్, కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు ఇందులో సభ్యులుగా ఉన్నారు. కల్తీ మద్యం కేసును లోతుగా విచారణ చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఘటనకు బాధ్యులను గుర్తించాలని సూచించింది. కాగా 2022 మార్చిలో కల్తీ మద్యం ..మిగతా 2లో

# డిక్లరేషన్లు కాదు.. డెడికేషన్ కావాలి

## కాల్పుల విరమణలో అమెరికా పాత్ర శూన్యం

### పార్లమెంటరీ కమిటీకి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వివరణ



**న్యూఢిల్లీ, మే 19 (నిఘా న్యూస్):** భారతదేశం-పాకిస్థాన్ కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం పార్లమెంటరీ కమిటీకి చెప్పారని ఓ కథనం తెలిపింది. సైనిక చర్యలను నిలిపివేయాలనే నిర్ణయం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక స్థాయిలో తీసుకున్నారని మిస్రీ నొక్కిచెప్పారని పార్లమెంటరీ వర్గాలు తెలిపినట్లు- పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్-పాక్ వివాదాన్ని ఆపడంలో తన పాత్ర గురించి పదే పదే ప్రస్తావించారు. ట్రంప్ వాదనలపై ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మిస్రీ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కనీసం ఏడుసార్లు కాల్పుల విరమణకు దోహదపడ్డానని బహిరంగంగా చెప్పుకున్నారు. ఈ అంశంపై భారతదేశం ఎందుకు మౌనంగా ఉందని పార్లమెంట్ ప్యానెల్‌లోని ఒక సభ్యుడు ప్రశ్నించారు. ముఖ్యంగా ట్రంప్ తన ప్రకటనలలో కశ్మీర్‌ను ప్రస్తావిస్తూనే ఉన్నారని మరో సభ్యుడు సూటిగా ప్రశ్నించారు. దీంతో భారతదేశం-పాకిస్థాన్ కాల్పుల విరమణ ద్వైపాక్షిక నిర్ణయం అని, మరే ఇతర దేశ ప్రమేయం లేదని పేర్కొంటూ విదేశాంగ కార్యదర్శి ఈ వాదనలను తోసిపుచ్చారని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. యుద్ధ విరమణ ఒప్పందంలో అమెరికా ఎటు-వంటి పాత్ర పోషించలేదని మిస్రీ ప్యానెల్‌కు వివరణ ఇచ్చారు. ఇంకా.. భారత్- పాకిస్థాన్ మధ్య వివాదం సంప్రదాయ యుద్ధ పరిధిలోనే ఉందని, ఇస్లామాబాద్ నుంచి ఎటు-వంటి అణ్వాయుధ దాడులకు సంబంధించిన అనుమానిత సంకేతాలు లేవని విదేశాంగ కార్యదర్శి పునరుద్ఘాటించారు. కానీ.. పాకిస్థాన్ చైనా మూలాల సైనిక హార్డ్‌వేర్‌ను ఉపయోగించడంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్పందించిన విక్రమ్ మిస్రీ.. 'వారు ఏమి ఉపయోగించినా పర్వాలేదు. మనము వారి వైమానిక స్థావరాలను తీవ్రంగా దెబ్బతీశాం అని చెప్పినట్లు- తెలుస్తోంది. యుద్ధ సమయంలో కోల్పోయిన భారతీయ విమానాల సంఖ్య గురించిను చెప్పేందుకు మిస్రీ నిరాకరించారు. జాతీయ భద్రతా సమస్యలను పేర్కొంటూ వ్యాఖ్యానించలేదు.

## సోషల్ మీడియాలో... సన్నాసుల ప్రచారం

మొదటి పేజీ తరువాయి...

లెక్క కాదని.. లబ్ధిపొందిన వాళ్ళు గుర్తు పెట్టుకుంటే చాలన్నారు. విషం చిమ్మాలని చూస్తున్నారని.. వాళ్ళ గురించి తాను పట్టించుకోనని మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐదారుగురు సన్నాసులు ఉండొచ్చని.. వాళ్ళ గురించి పట్టించుకోనన్నారు. నల్లమల్ల బిడ్డగా ఆ ప్రాంతం గురించి సీఎం ప్రస్తావించారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతమని.. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారని గుర్తు చేశారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే తన గుండె ఉప్పొంగిపోతోందన్నారు. పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటానన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటునని మరోసారి భరోసా ఇచ్చారు. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టాలన్నా పాలమూరు వాసులను పిలిచేవారని.. ఇక్కడి ప్రజలు కట్టిన ప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయన్నారు.

## పథకాల అమలులో పారదర్శకత ముఖ్యం

మొదటి పేజీ తరువాయి...

ఇంకా మెరుగుపరచాలని ఆదేశాలు జారీ చేశారు. దీపం లబ్ధిదారులకు ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము ఇచ్చే అంశంపై పరిశీలించాలన్నారు. డేటా అనలటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సీఎం మార్గనిర్దేశర చేశారు. ఆర్టీసీ సేవల్లో ఇంకా మార్పులు రావాలని, నాణ్యత పెరగాలన్నారు సీఎం చంద్రబాబు సూచించారు. దీపం పథకంలో ఇచ్చే మూడు సిలండర్ల సబ్సిడీ ఒకేసారి జమ చేస్తామన్నారు. ప్రభుత్వ సేవల్లో డేటా కీలకం అని సీఎం అధికారులతో అన్నారు. 'జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు జరగొచ్చు. ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందే. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలి. దీపం లబ్దిదారుల ఖాతాలో ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము జత అవుతుంది. డాటా అనలిటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. రేషన్ పంపిణీ నాణ్యతపై ప్రజల సంతృప్తి పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. కొన్ని సంక్షేమ పథకాల అమలు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయిలో సంతృప్తి కనిపించాలి. ఆర్టీసీ టాయిలెట్స్, తాగునీటి నిర్వహణ విషయంలో అసంతృప్తి వస్తోంది. త్వరలో డ్వాక్రా మహిళలకు తడి చెత్త నిర్వహణ బాధ్యత, కంపోస్టు తయారీ అప్పగిస్తాం. ప్రభుత్వ సేవల్లో డేటా కీలకం' అని ప్రభుత్వ పథకాలు, సేవలపై సమీక్షలో సీఎం చంద్రబాబు అన్నారు.


## కాళేశ్వరం కమిషన్ గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి...

సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై గతేడాది నుంచి విచారణ జరిపింది. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై విచారించింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను ప్రశ్నించింది. వారి నుంచి అఫిడవిట్లు- తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

## గతంలో ప్రకటించిన డిక్లరేషన్లు ఏమయ్యాయి

### కాంగ్రెస్ నల్లమల డిక్లరేషన్‌పై హరీష్ విమర్శలు



**హైదరాబాద్ మే 19 (నిఘా న్యూస్):** ఆర్భాటంగా డిక్లరేషన్లు ప్రకటించడమే తప్ప.. అమలు చేసే డెడికేషన్ మాత్రం అస్సలు లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అమలు చేస్తామన్న రైతు డిక్లరేషన్ ఆగమైపోయింది.. బీరాలు పలికిన బీసీ డిక్లరేషన్ దిక్కు లేకుండా పోయిందని.. ఇప్పుడు కొత్తగా నల్లమల డిక్లరేషన్ తెరమీదకు తీసుకొచ్చారని మండిపడ్డారు. పైన పటారం లోన లొటారం డిక్లరేషన్ల పేరిట డంబాచారమని సెటైర్ వేశారు. తాను నల్లమల బిడ్డనని గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి.. తనను కలుసుకోవడానికి వచ్చిన అమాయక చెంచు బిడ్డలను అరెస్టు చేసి తన నిరంకుశ నైజాన్ని మరోసారి బయటపెట్టు-కున్నాడని హరీశ్‌రావు విమర్శించారు. ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేసి, చెంచు ఉద్యమ నాయకులను నిర్బంధించి నల్లమల డిక్లరేషన్ ప్రకటించడమే ప్రజా పాలనా అని ప్రశ్నించారు. ఎప్పటిలాగే రేవంత్ ప్రసంగంలో తెచ్చి పెట్టు-కున్న ఆవేశం తప్ప, కం-టె-ంట్ లేదు, కాం-టె-స్ట్ లేదని అన్నారు. ఆత్మస్తుతి పరనింద తప్ప, అక్కరకు వచ్చే ముచ్చట లేదని విమర్శించారు. అలవా-టైన ఊకదంపుడు ప్రసంగాన్నే అదే పనిగా దంచాడని అన్నారు. తమ పరిపాలన ప్రయోజనాలను ప్రజలు పదే పదే గుర్తు చేసుకుంటు-న్నారని డబ్బా కొట్టు-కున్నడని చెప్పారు. అవును రేవంత్ రెడ్డి గారూ.. మీ అసమర్థ పాలనలో అమలు కాని హామీలను ప్రజలు పదే పదే గుర్తు చేసుకుంటు-న్నారు అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రుణమాఫీ ఎగ్గొట్టినందుకు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ బావురుమంటు-న్నందుకు.. కల్లాల దగ్గర పడిగాపులు కాస్తూ కన్నీరు పెట్టు-కుంటు-న్నందుకు.. వడగండ్లతో పంట నష్టపోయి గుండెలు బాదుకుంటు-న్నందుకు రైతులు.. మిమ్మల్నే గుర్తు చేసుకుంటున్నారని మండిపడ్డారు. మహాలక్ష్మి కింద నెల నెలా రావాల్సిన 2500 ఇంకా రావడం లేదని ఆడబిడ్డలు.. కల్యాణ లక్ష్మి కింద రావాల్సిన తులం బంగారం కోసం ఆడపిల్ల తల్లిదండ్రులు.. మీరిస్తామన్న స్కూటీ-ల కోసం ఆశగా ఎదురు చూస్తున్న యువతులు.. పదే పదే గుర్తు చేసుకుంటు-న్నారని అన్నారు. విద్యాభరోసా కింద ఇస్తామన్న 5 లక్షల కార్డు కోసం విద్యార్థులు.. ఏడాదిలో ఇస్తామని చెప్పి ఏడాదిన్నర దాటు-తున్నారని 2లక్షల ఉద్యోగాల కోసం, ఏ నెలకు ఆ నెలకు ఖాళీలను భర్తీ చేస్తూ ప్రకటిస్తామన్న జాబ్ క్యాలెండర్ కోసం నిరుద్యోగులు గుర్తు చేసుకుంటు-న్నారని చెప్పారు. ఇంకా పింఛన్లు పెంచుతలేవని అవ్వాతాతలు, దివ్యాంగులు, నిస్సహాయులు.. డీఏ, పీఆర్సీ, పింఛన్ ప్రయోజనాల కోసం ఉద్యోగులు, రి-టైర్డ్ ఉద్యోగులు.. తమను ఎప్పుడు ప్రభుత్వంలో విలీనం చేస్తారా అని ఆర్టీసీ కార్మికులు నిత్యం నిన్నే తలుచుకుంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి అతిశయోక్తులు ఎట్లా ఉంటాయంటే, అమాస నాడు పున్నమి వెన్నల అనగలడని హరీశ్‌రావు సె-టైర్ వేశారు. ఓవైపు నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగులు కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తుంటే, నిరుద్యోగులే నోటిఫికేషన్లు వద్దంటు-న్నారని తుపాకీ రాముని డైలాగులు పేలుస్తూ కామెడీ చేస్తున్నడని అన్నారు. దేశాలు తిరిగి తెచ్చామని ప్రచారం చేసుకుంటు-న్న పెట్టు-బడుల వ్యవహారం ఎట్లుందంటే, సచ్చిపోయిన బర్రె పగిలి పోయిన కుండెడు పాలు ఇచ్చిందన్న చందంగా ఉందన్నారు. అసలు ఆరు గ్యారెంటీల ఊసెత్తడమే మానేసిండు. ఇంతకన్నా మోసం, దగా ఇంకేం ఉంటుందని మండిపడ్డారు. గుడ్డిలో మెల్ల అన్నట్లు రాష్ట్రం దివాలా, దివాలా అన్న పాట మాత్రం పాడలేదు. నెంబర్ వన్ రాష్ట్రం అని మాట మార్చిండు అన్నారు. రేవంత్ రెడ్డి రంగులు మార్చే తీరును చూసి నల్లమల అడవుల్లోని ఊసరవెళ్లులు కూడా నివ్వెరపోతున్నాయని విమర్శించారు.

## ఆశ్రయమివ్వడానికి... భారత్ ధర్మసత్రం కాదు

### శ్రీలంక శరణార్థి అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీం



**న్యూఢిల్లీ, మే 19 (నిఘా న్యూస్):** ప్రపంచంలోని అందరికీ ఉచితంగా ఆశ్రయం ఇవ్వడానికి భారతదేశం ధర్మశాల కాదని సుప్రీంకోర్టు సోమవారం నాడు కీలక వ్యాఖ్యలు చేసింది. శరణార్థిగా తనకు ఇండియాలో ఆశ్రయం ఇవ్వాలని శ్రీలంక జాతీయుడు ఒకరు చేసిన అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలంతో సంబంధాలున్నాయనే అనుమానంతో 2015లో పిటిషనర్‌ను అరెస్టు చేశారు. తనను శరణార్థిగా పరిగణించాలని కోరుతూ అతను వేసిన తాజా పిటిషన్‌పై న్యాయ మూర్తులు దీపాంకర్ దత్తా, జస్టిస్ కె.వినోద్ చంద్రతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. శ్రీలంక జాతీయుడికి 2018లో విచారణ కోర్టు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద పదేళ్ల జైలు శిక్ష విధించింది. 2022లో మద్రాసు హైకోర్టు అతని జైలుశిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్ష పూర్తికాగానే దేశం విడిచి వెళ్లాలని, దేశం విడిచివెళ్లడానికి ముందు శరణార్థి శిబిరంలో ఉండాలని ఆదేశించింది. కాగా, సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా పిటిషనర్ తన వాదన వినిపించారు. వీసాతో తాను ఇండియా వచ్చానని, తన ప్రాణాలకు స్వదేశంలో ముప్పు ఉందని కోర్టుకు విన్నవించారు. తన భార్య, పిల్లలు ఇండియాలో స్థిరపడ్డారని, ఇప్పటికి తాను మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్నానని, డిపోర్టేషన్ ప్రక్రియ మొదలు కాలేదని చెప్పారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ఉచిత సత్రం కాదని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. తాను చట్టబద్ధమైన వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని శ్రీలంక వాసి పేర్కొన్నాడు. అంతేగాక, తన భార్యాపిల్లలు ఈ దేశంలోనే సెటిల్ అయ్యారని తెలిపాడు. తనకు ఇక్కడే ఆశ్రయం కల్పించాలని కోరాడు. దీనికి జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్‌పై అసహనం వ్యక్తం చేసింది. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు భారతదేశం ఆశ్రయం ఇవ్వాలా? ఇప్పటికే మా దేశంలో 140 కోట్ల మంది జనాభా ఉంది. అన్ని దేశాల నుంచి వచ్చే వారిని ఆదరించేందుకు భారత్ ధర్మశాల కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరపు న్యాయవాది స్పందిస్తూ.. శ్రీలంకలో అతడి ప్రాణాలకు ముప్పు ఉందని తెలిపారు. అలాగైతే మరో దేశానికి వెళ్లండని సుప్రీం కోర్టు సూచించింది.

## అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ పుష్కరాలపై లేదా?



మొదటి పేజీ తరువాయి...

సరికాదని అన్నారు. సరస్వతి పుష్కరాలు నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. ఇంత పెద్దఎత్తున జరుగుతున్న పుష్కర పండగకు ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ. 35 కోట్లు ఎలా సరిపోతాయని నిలదీశారు. అందాల పోటీలకు రూ.300 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం ఆధ్యాత్మికతకు రూ. 35 కోట్లు వెచ్చించడమెంటని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ తన సతీమణి అపర్ణతో కలిసి సోమవారం మధ్యాహ్నం కాళేశ్వరం విచ్చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు కేంద్రమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పోలీస్ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య కేంద్రమంత్రి దంపతులు పుష్కర స్నానాన్ని ఆచరించారు. అక్కడి నుంచి నేరుగా శ్రీకాళేశ్వర ముక్తేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. బండి సంజయ్ దంపతులకు పూజారులు ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. అంతకుముందు పుష్కరఘాట్ వద్ద, ఆ తర్వాత కాళేశ్వరస్వామి ఆలయం వద్ద మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే సరస్వతి పుష్కర స్నానం చేయడం చాలా సంతోషంగా ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

'సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం విచ్చేసి పుష్కర స్నానం ఆచరించడం చాలా సంతోషంగా ఉంది. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమం ఇది. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు హాజరై స్నానమాచరించడం ఆనందంగా ఉంది. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, వారి కష్టాలన్నీ తొలగిపోవాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశానికి మరింతగా సేవలు అందించేలా దీవించాలని ఆ స్వామివారిని ప్రార్థించా' అని బండి సంజయ్ తెలిపారు.

**కాళేశ్వరం చాలా శక్తివంతమైన ప్రాంతం...**

'ఏమైనా మాట్లాడితే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నిస్తారు. అన్నీ కేంద్రమే చేస్తే ఇక రాష్ట్రం ప్రభుత్వం ఎందుకు. కేవలం ఒక ఏరియాకే పుష్కరాలను పరిమితం చేయడం సరికాదు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులందరి కోరికలు తీర్చాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నా. కాళేశ్వరం చాలా శక్తివంతమైన ప్రాంతం. గత కేసీఆర్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో మనకు చాలా చెడ్డ పేరు వచ్చింది. అలాగే గత ప్రభుత్వం కాళేశ్వరం ఆలయానికి రూ.100 కోట్లు ఇస్తానని మొండిచేయి చూపింది. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా రూ. 200 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చారు. గతంలో వేములవాడకూ ఇలానే హామీ ఇచ్చారు. కానీ ఎన్ని నిధులిచ్చారో ప్రజలందరికీ తెలుసు. ఇప్పటికైనా వట్టి హామీలను పక్కనపెట్టి కాళేశ్వరాన్ని అద్భుతమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి' అని కేంద్రమంత్రి బండి సంజయ్ కోరారు.

## శ్రీవారి తులాభారంలో రోజుకు 10 లక్షల దోపిడీ

### శ్రీవారి సొమ్మును వాటాలుగా పంచుకున్నారు.

### ఐదేళ్లలో జరిగిన అరాచకాలపై విచారణ జరపాలి: భాను ప్రకాష్ రెడ్డి

**తిరుపతి, మే 19 (నిఘా న్యూస్):** జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని పాలక మండలి సభ్యుడు, బీజేపీ నేత భాను ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. టీటీడీని ధనార్జన క్షేత్రంగా మార్చి స్వామి వారి ఖజానాకు తూట్లు పొడిచారంటూ గత ప్రభుత్వ పాలకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని తులాభారం నగదును అక్కడ సిబ్బంది తస్కరించారని ఆయన పేర్కొన్నారు. వాటిపై విచారణ చేపట్టి కేసు నమోదు చేయాలని విజిలెన్స్ ఎస్పీని కోరినట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించి.. తన వద్దనున్న ఆధారాలను ఎస్పీకి సైతం అందజేసినట్లు చెప్పారు. 2019 నుంచి 2024 వరకు విచారణ చేపట్టాలని జిల్లా ఎస్పీని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

గతంలోని ఉన్నతాధికారులు, విజిలెన్స్ సిబ్బందిని సైతం విచారించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతిలో బీజేపీ నేత భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. పరకామణి దొంగతనం, కల్తీ నెయ్యి వ్యవహారంతోపాటు తాజాగా తులాభారంలో భక్తులు సమర్పించిన కానుకలను సైతం దొంగిలించారన్నారు. తులాభారంపై జరిగిన అక్రమాలను అప్పటి విజిలెన్స్ అధికారులు బయట పెట్టినా.. నాటి ఉన్నతాధికారులు వాటిని బుట్ట దాఖలా చేశారని గుర్తు చేశారు.

భక్తులు సమర్పించిన కానుకలను సగం లెక్క చూపి.. సగం దొంగతనంగా తీసుకెళ్లారన్నారు. వీటిపై విచారణ చేపట్టి కేసు నమోదు చేయాలని విజిలెన్స్ ఎస్పీని కోరినట్లు ఆయన వివరించారు. పరకామణిలో దొంగతనం చేసిన ఉద్యోగిని చెట్టు కింద పంచాయతీ చేసినట్లు చేసి.. బేషరతుగా విడిచిపెట్టారని ఆయన వివరించారు. అదేవిధంగా తులాభారంలో దొరికిన దొంగలపై కేసు నమోదు చేయకుండా విడిచిపెట్టారని చెప్పారు. ఈ తరహా సంఘటనలు చూస్తుంటే.. శ్రీవారి ఆభరణాలను సైతం దొంగలించారేమోననే అనుమానం కలుగుతుందన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు మంగళవారం జరగనున్న పాలక మండలి సమావేశంలో సైతం ఈ అంశాన్ని చర్చిస్తానని భాను ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం

మొదటి పేజీ తరువాయి...

సేవించి 20మంది చనిపోయారు. 2022 మార్చిలో జంగారెడ్డి గూడెంలో నమోదైన అసహజ మరణాలపై లోతుగా దర్యాప్తు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ మరణాలకు సంబంధించి జంగారెడ్డిగూడెం పోలీసు స్టేషన్‌లో నమోదైన 4 వేర్వేరు కేసుల ప్రస్తుత పరిస్థితి తదితర అంశాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. వీటిపై లోతైన విచారణ చేసి అసహజ మరణాలకు బాధ్యులు ఎవరో గుర్తించాలని ఆదేశాలిచ్చింది.

## అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటాం

మొదటి పేజీ తరువాయి...

గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాదంలో ప్రాణ నష్టం తగ్గేదని అభిప్రాయపడ్డరు. ఫైర్ బ్రిగేడ్‌కు సరైన మాస్కులు లేకపోవడంలో వాళ్లు లోపలికి వెళ్లి బాధితులను కాపాడలేకపోయారన్నారు.. అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ, ఇలాంటి మౌలిక సదుపాయల కల్పనపై పెడితే బాగుంటుందని అన్నారు.. 125 సంవత్సరాల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలో 17 మంది చనిపోవడం హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరమని పేర్కొన్నారు.

**కేటీఆర్ ఇంకా ఏమన్నారంటే**

గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాద సంఘటన హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరం. గుల్జార్ హౌస్ గురించి తెలియని వాళ్లు హైదరాబాద్, తెలంగాణలో ఎవరూ లేరు. 125 సంవత్సరాల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలోని 17 మంది చనిపోవడం మనసున్న ప్రతీ ఒక్కరిని కలిచివేసింది. బాధిత కుటుంబసభ్యులు ఎవరినీ నిందించడం లేదు. కాని వారు కొన్ని విషయాలు చెప్పారు. ఫైర్ బ్రిగేడు నీళ్లు లేకుండా వచ్చింది. ఫైర్ బ్రిగేడ్ వాళ్లు సరైన మాస్కులు లేకుండా రావడంతో లోపలికి వెళ్లలేకపోయారు. అంబులెన్స్ లలో కూడా ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు లేకపోవడం దారుణం. ఈ కనీస సదుపాయలు ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్ లో ఉంటే కొన్ని ప్రాణాలు బతికేవని బాధిత కుటుంబ సభ్యులు అంటున్నారు. అగ్నిప్రమాదం జరగగానే స్థానికులైన హిందువులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో వచ్చి మమ్మల్ని కాపాడారని చెప్పారు. మాకు జరిగిన నష్టం రాబోయే రోజుల్లో ఎవరికీ జరగకూడదని కోరుకుంటున్నారు. భవిష్యత్తులో ఎవరు చనిపోకుండా చూడమని కోరారు. నేను రాజకీయం చేయడానికి



రాలేదు. ఎవరినీ విమర్శించడం లేదు. కాని ఎండాకాలం వచ్చిందంటే మున్సిపల్ శాఖ మంత్రి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యల మీద రివ్యూ సమావేశం పెట్టుకోవాలి. పాతబస్తీ అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రదేశం. ఏదైనా ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్ లు రావడానికి కూడా వీలుకాలేదు. అధికారులకు నిరంతరం ట్రైనింగ్ ఇవ్వాలి. తరుచుగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలి. ఇవేవి జరగలేదు. ఇది మంచిది కాదు. అంబులెన్స్ లు వచ్చినయి కాని అందులో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు లేకపోవడంతోనే ఎక్కువ ప్రాణ నష్టం జరిగింది. ఎనిమిది మంది చిన్నారులు తమ కళ్లముందే చనిపోయారని చెపుతున్నారు. ప్రాణాలు పోయిన తర్వాత నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా చూడండి. అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ ఇలాంటి వాటిపై కూడా పెట్టండి. అందాల పోటీలపై పెట్టే ఖర్చు ఇలాంటి సందర్భాల్లో ఉండాల్సిన మౌలిక సదుపాయలపై పెట్టండి. రేవంత్ రెడ్డి దగ్గరనే హోం, మున్సిపల్ శాఖలు ఉన్నాయి. సంఘటన స్థలం దగ్గరికి రేవంత్ రెడ్డి వస్తే బాగుండేది. ఐదు లక్షల నష్టపరిహారం సరిపోదు. ఇంటికి, వ్యాపారానికి తీవ్ర నష్టం జరిగింది. 125 సంవత్సరాల నుంచి హైదరాబాద్ లో ఉంటున్న అగర్వాల్ కుటుంబం మళ్లీ తమ వ్యాపారం ప్రారంభించుకోడానికి ప్రభుత్వం సహకరించాలి. రూ. 25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను. బీఆర్ఎస్ తరపున కూడా ఆదుకునే ప్రయత్నం చేస్తాము. రాజకీయం చేయడానికి రాలేదు. ఇలాంటి కడుపు కోత ఇంకెవరికి రాకూడదని వచ్చాను. ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని కోరుతున్నాను.

# సమాజాన్ని తిరోగమనం వైపు నడిపిస్తున్న బిజెపి

- దోపిడీకి లాభం అనే పేరు పెట్టి ప్రజా సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్లు
- కమ్యూనిజమే సరైన రాజకీయ దృక్పథమన్న సుందరయ్య
- కామ్రేడ్ సుందరయ్య 40వ వర్ధంతిసభ
- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



**కడప, మే 19 (నిఘా న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప నగర కమిటీ కార్యదర్శి ఏ.రామ్మోహన్ అధ్యక్షతన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ జరిగింది. కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 2013 మే 1వ తేదీ నెల్లూరు జిల్లా కొవ్వూరు నియోజకవర్గం అలగానిపాడులో ధనిక భూస్వామి కుటుంబంలో జన్మించారని తెలిపారు. 14 సంవత్సరాల వయసులోనే అంటరానితనానికి వ్యతిరేకంగా, సామాజిక అసమానతలు సరికాదని చెప్పేవాడని, కుటుంబ సభ్యులతోనే గొడవ పెట్టుకుని తన ఇంట్లో అందరికీ ఒకే భోజనం చేసేలా తన కుటుంబాన్ని మొదటగా సంస్కరించారన్నారు. 1930 లో మద్రాస్ లో జరుగుతున్న నాటి గాంధీ సభకు హాజరై కాంగ్రెస్ పార్టీలోని సోషలిస్ట్ వింగులో పనిచేశారన్నారు. "సైమన్ గో బ్యాక్" ఆందోళనలో విద్యార్థి దశలోనే విద్యార్థులకు నాయకత్వం వహించి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలు చేశారన్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు అమీర్ హైదర్ ఖాన్ పరిచయంతో పరిపూర్ణమైన కమ్యూనిస్టుగా శిక్షణ పొందారన్నారు. 1936లో దేశంలోని అన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఐక్యమై అఖిల భారత కేంద్ర కమిటీ ఏర్పడిందని నాడు అందులో కేంద్ర కమిటీ సభ్యులుగా మొదటగా ఎన్నికయ్యారన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీని నిషేధించడంతో 1939 నుండి 1942 వరకు అజ్ఞాతంలో ఉంటూ రహస్య జీవితాన్ని గడిపారని తెలిపారు. 1943లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ బొంబాయి జాతీయ మహాసభల్లో తిరిగి కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన ప్రముఖుల్లో అగ్రగన్యుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. 1985 మే 19వ తేదీ అనారోగ్యంతో మరణించేవరకు కూడా కమ్యూనిజమే సరైన రాజకీయ దృక్పదమని, దోపిడీ వర్గాలపై పదునైన వ్యాసాలు రాసి కమ్యూనిస్టు శ్రేణులను చైతన్య పరిచేవారని గుర్తు చేశారు. నేడు దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత సమాజాన్ని తిరోగమన వైపు మళ్ళిస్తోందని, దోపిడి కి లాభం అని పేరు పెట్టి కార్పొరేట్సుకు దేశ ప్రజల ఉమ్మడి సంపదను దోచుకుంటూ ఉంటే కేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం వారికి పూర్తిగా సహకరించి వత్తాసు పలుకుతోందని ఆరోపించారు.

నేడు సిపిఎం శ్రేణులు ఉమ్మడి ప్రజా ప్రయోజనాల పట్ల ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, సిపిఎం నాయకులు సిపిఎం కడప నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, ప్రజానాట్యమండలి నాయకులు నరసింహ, డివైఎఫ్ఐ కడప నగర కమిటీ కార్యదర్శి విజయ్, సిఐటియు నాయకులు ఉదయ్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రఘు, మహిళా సంఘం నాయకులు హాజరయ్యారు.

## రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్



**చిలుకానగర్, మే 19 (నిఘా న్యూస్):** చిల్కానగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ కళ్యాణపురి కాలనీలో సుమారు 52 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను చిలుకా నగర్ డివిజన్ కార్పొరేటర్ గీత జిహెచ్ఎంసి అధికారులు ఈ. ఈ. హరిలాల్, డి ఈ, ఏఈ లతో కలిసి పర్యవేక్షించారు.అనంతరం కార్పొరేటర్ గీత మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న ప్రతి సిసి రోడ్ వద్ద కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు తరచూ పర్యవేక్షించాలని, సీసీ రోడ్ల లెవెల్స్ సరిగ్గా ఉండే విధంగా చూడాలని, సీసీ రోడ్డు పూర్తయ్యేంతవరకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డి.ఈ. వెన్నెల గౌడ్, ఏ.ఈ. రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్ బాలకృష్ణ గౌడ్, శ్యామ్, కాలనీ అధ్యక్షులు సతీష్, కాలనీ సభ్యులు రాజశేఖర్, రత్నకుమార్ ,భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామంతపూర్ బైపాస్ రోడ్డులో రాజిరెడ్డి విగ్రహం

### స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



**రామంతపూర్, మే 19 (నిఘా న్యూస్):** మేడ్చల్ నియోజకవర్గం నుండి విభజన తరువాత ఉప్పల్ నియోజకవర్గం తొలి శాసనసభ్యులు దివంగత మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి రామంతపూర్ బైపాస్ రోడ్డు ఉప్పల్ మెట్రో స్టేషన్ నుండి అలీకేఫ్ వరకు రాజిరెడ్డి చొరవతో రోడ్డు అభివృద్ధి జరిగింది. ఆ రోడ్డుకి బండారి రాజిరెడ్డి పేరు నామకరణం, ఆయన విగ్రహ ప్రతిష్ట కోసం సోమవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రవి కుమార్, ఉప్పల్ సర్కిల్ జనరల్ సెక్రెటరీ సుర్వి మురళి గౌడ్, కాంగ్రెస్ నాయకులు, శ్రీనివాస్ యాదవ్ రామంతాపూర్ డివిజన్ ఇన్చార్జి తవీడబోయిన గిరిబాబు , మాజీ యువజన కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్ వినోద్ ముదిరాజ్, స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు చేసిన బండారి రాజిరెడ్డి విగ్రహం ఏర్పాటుచేసి రామంతపూర్ బైపాస్ రోడ్డుకు ఆయన నామకరణం చేయునట్లు వారు వెల్లడించారు.

## సుక్క కిరణ్ కుమార్‌కు దళిత రత్న అవార్డు



**ఉప్పల్, మే 19 (నిఘా న్యూస్):** దళిత హక్కులు, ఆత్మగౌరవం కోసం కొనసాగిస్తున్న పోరాటానికి గుర్తింపుగా ఎన్నో యేండ్ల నుండి దళితుల అభ్యున్నతి కోసం పరితపిస్తూ మహనీయుల విగ్రహాలకు పాలాభిషేకాలు, అన్నదానాలు నిర్వహిస్తూ ప్రజా సేవలో పరితపించే ఉప్పల్ డివిజన్ కు చెందిన సుక్క కిరణ్ కుమార్‌కు దళిత రత్న అవార్డును మంత్రి దామోదర్ రాజనర్సింహా అందజేయడం జరిగింది. సుక్క కిరణ్ గత కొన్ని సంవత్సరాలుగా దళిత హక్కుల కోసం, అలాగే పేదల సంక్షేమం కోసం నిరంతర పోరాటం చేస్తున్నారు. ఆయన సేవలను, కృషిని గుర్తించిన వారు అవార్డు అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు నా పట్ల మాత్రమే కాదు, ప్రతి పేద, మైనార్టీ, దళితుల హక్కుల కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ గౌరవమని అన్నారు. ఈ అవార్డు సుక్క కిరణ్ కి రావడం పట్ల సామాజిక సేవలకు, వారి పోరాటానికి ఒక గుర్తింపు అని పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు ఎస్సీ సెల్ చైర్మెన్ ఇటుక రాజు ముంజగల్ల విజయ్, ఏపూరి సోమన్న, దొమ్మటి సుదర్శన్ బాబు చెరుకు రామచంద్ర, రవీందర్ జగన్, బాలకృష్ణ గుండె మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు అబ్దుల్ సత్తార్‌కు నివాళులు



**ఉప్పల్, మే 19 (నిఘా న్యూస్):** సుదీర్ఘకాలం జర్నలిస్టుగా వివిధ దిన పత్రికల్లో పనిచేసిన అబ్దుల్ సత్తార్ రామంతాపూర్ లోని తన స్వగృహంలో సోమవారం ఉదయం ఆయన కన్ను మూశారు. అబ్దుల్ సత్తార్ మృతి సంతాప సూచికగా సోమవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు వెంకటరామిరెడ్డి, పల్లా మహేందర్ రెడ్డి, వడ్డేపల్లి కిషోర్, తిరుపతిరెడ్డి, సురేష్, శ్రీధర్ రావు, రాజు, శివాజీ తదితరులు పాల్గొని అబ్దుల్ సత్తార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పత్రిక రంగంలో చేసిన సేవలను గుర్తుచేసుకొని కొనియాడారు. అబ్దుల్ సత్తార్ కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

## తూప్రాన్‌లో జూన్ 6 నుండి బడిబాట

### మండల విద్యాధికారి పార్వతీ




తూప్రాన్, మే 19 (నిఘా న్యూస్): మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ లో మండల విద్యాధికారి పార్వతి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు, ముఖ్యంగా జూన్ 6 నుండి బాడీబాట కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. ఎస్ఎస్సి ఫలితాలలో తూప్రాన్ మండలం అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలను ఏర్పాటు చేసి వారి నుండి సలహాలను తీసుకోవడం జరుగుతుందని ఈ శుక్రవారం చివరి సమావేశం ఏర్పాటు చేస్తామని అనంతరం గ్రామ గ్రామాన వీధి వీధినా బడిబాట కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. విద్య విధానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలోనే బాలబలికలు విద్యను అభ్యసించాలని, మెరుగైన విద్యను అభ్యసించి విధ్యా రంగంలో ఆరితేరిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలోనే ఉంటారని తెలిపారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని వారు తెలిపారు. అంతేకాకుండా మండల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు పాఠశాల ప్రారంభ సమయానికి రావాలని, పాఠశాల చివరి గడియల వరకు పాఠశాలలోనే ఉండి విద్యార్థులను తీర్చిదిద్దాలని వివరిస్తూ ఎవరైనా స్కూల్ సమయాన్ని పాటించకపోతే వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని దీనిని ఎవరు ఉల్లంఘించిన చర్యలు ఉంటాయన్నారు.

## వేసవి శిబిరాలలో విద్యార్థుల సృజనా త్మకతకు పదను : ఎంఈఓ




**తూప్రాన్, మే 19 (నిఘా న్యూస్):** వేసవి శిబిరాలతో విద్యార్థులను సృజనాత్మకతకు పదును పెట్టాలని తూప్రాన్ మండల విద్యాధికారి పార్వతీ విజ్ఞప్తి చేశారు. తూప్రాన్ లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడుతూ వివిధ రంగాలలో విద్యార్థులు నైపుణ్యతను కనబరిచాలన్న దృక్పథంతో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా క్రాఫ్ట్, ఆర్ట్, గేమ్స్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, టెక్నికల్ రంగాలలో విద్యార్థులకు నైపుణ్యత కలిగిన శిక్షకుల ద్వారా శిక్షణ ఇప్పించారు.

సోమవారం తూప్రాన్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తూప్రాన్ ఎస్ఐ.శివానందము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.వారు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తారని, పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించిన విద్యను సక్రమంగా వింటారని, తల్లిదండ్రులు ఇంటి వద్ద చెప్పిన విషయాలు గమనించి వారికి అనుకూలంగా మెదులుతారని తెలిపారు. ఎవరైతే క్రమరహితంగా ఉంటారో వారు ఇకనుండి క్రమశిక్షణ కలిగి మెదలాలని పాఠశాల యందు టీచర్లు ఏమీ బోధిస్తున్నారో వాటిని క్షుణ్ణంగా విని నేర్చుకోవాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల విషయంలో వినయ విధేయతలను చూపించాలని తెలిపారు. అంతేకాకుండా ఒక విద్యనే కాకుండా ఆటపాటల యందు వివిధ రంగాలలో విద్యార్థులు ప్రతిభను కనపరిచాలని ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థిని, విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలను సాధించాలని తల్లిదండ్రులకు, విద్యను నేర్పిన ఉపాధ్యాయులకు ఘన కీర్తి ప్రతిష్టలను తీసుకు రావాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి %ఝుఝు% సత్యనారాయణ, ట్రైనింగ్ ఉపాధ్యాయులు, అనీష్, శ్రీనివాస్, స్వాతి, ఎంఈఓ సిబ్బంది తల్లిదండ్రులు ఉన్నారు.


## ఉపాధి పనుల వద్ద కూలీలకు సౌకర్యాలు కల్పించాలి: డిబిఎఫ్




**హనుమకొండ, మే 19 (నిఘా న్యూస్):** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు సాకుతో నిలిపి వేసిన ఉపాధి హామీ జాబ్ కార్డుల జారీ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని జాబ్ కార్డుల జారీ ని నిరంతరం కొనసాగించి చట్టం స్ఫూర్తిని కొనసాగించాలని,పనుల వద్ద కూలీలైన హక్కుదారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పతకం లబ్దిదారులకు అర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని దళిత బహుజన ఫ్రంట్(డిబిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ వై. గణేష్ కి పలు డిమాడ్ లతో కూడిన వినతిపత్రాన్ని డిబిఎఫ్ ఆద్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ భూమి లేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు పేరుతో ఉపాధి హామీ చట్టానికి విరుద్ధంగా జాబ్ కార్డులలో పేర్ల నమోదు, నూతన జాబ్ కార్డుల జారిని నిలిపివేశారని, జాబ్ కార్డుల జారిని నిలిపి వేయడమంటే ఉపాధి హామీ చట్టాన్ని అడుగడుగునా ఉల్లంఘనలకు పాల్పడటమే అవుతుందని అన్నారు. కనుక జాబ్ కార్డు లలో పేర్ల నమోదు, నూతన జాబ్ కార్డుల జారీ నిరంతర పక్రియగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా చట్టానికి విరుద్దంగా తొలగించిన జాబ్ కార్డులను తిరిగి యాక్టివ్ గా మార్చాలని, పని ప్రదేశంలో కనీస వసతులైన నీరు,నీడ,మెడికల్ కిట్స్ లను అందుబాటులో వుంచాలన్నారు.

రద్దు చేసిన వేసవి అలవెన్స్ ను తిరిగి చెల్లించాలని,పనిముట్లైన పార, గడ్డపార, గంపలు, టెంట్‌లు, మెడికల్ కిట్స్ పథకం ప్రారంభ దశలో పంపిణి చెసినవే తప్ప కొత్తగా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కూలీలకు పనిముట్లను వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర మహిళ నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా అధ్యక్షులు కొమ్ముల కరుణాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, నాయకులు రాజు, కృష్ణ, కిరణ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి ముందే టోల్ గేట్ ధ్వంసం



**నారాయణపేట, మే 19 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా మక్తల్ మండల కేంద్రంలోని కాచ్ వార్ గ్రామ సమీపంలో నేషనల్ హైవే 167 రోడ్ హైదరాబాద్ నుండి రాయచూరు వెళ్లే రోడ్డుపై నిర్మిస్తున్న టోల్గేట్ ప్రారంభం కాకముందే ధ్వంసమైన ఈ రోడ్డుపై రాత్రి పగళ్ళు టిప్పర్ వాహనాలు అతివేగంగా నడుస్తుంటాయి. అతివేగంగా నడిచే వాహనాలను సంబంధించిన అధికారి చూసి చూడనట్లు మౌనం పాటిస్తున్నారని ప్రజల ఆవేదన వ్యక్తపరిచారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

### మండల అభివృద్ధి అధికారి శెట్టి రవికుమార్



**బషీరాబాద్, మే19 (నిఘా న్యూస్):** ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి శెట్టి రవికుమార్ వెల్లడించారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలోని సమావేశపు మందిరంలో మండల అభివృద్ధి అధికారి శెట్టి రవికుమార్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ రుక్సానా బేగం, అంగన్వాడి క్షేత్రస్థాయి పర్యవేక్షణ అధికారిణి జ్యోతి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సుందరయ్య

### ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి వర్ధంతి సభ



**మొవ్వ, మే 19 (నిఘా న్యూస్):** దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, సిపిఎం సీనియర్ నాయకులు పీడిత ప్రజల ఆశాజ్యోతి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం మొవ్వ మండలంలో నిడుమోలు, కాజా,చినముత్తేవి గ్రామాలలో ఆయా సిపిఎం సభ్యులు, సానుభూతి పరులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శీలం నారాయణరావు, పార్టీ సీనియర్ సీనియర్ నాయకులు మద్దుల బసవరావు, మండల కమిటీ సభ్యులు ఉప్పలపు వెంకటాద్రి, కొడాలి కరుణాకర్ రావు, మాదాసు నాగులు, కాకి రాజశేఖర్, పార్టీ సభ్యులు పి శాంసన్, జె.వాసు, డి.మణి, ఆర్ మురహరి రెడ్డి, కె.శ్రీనివాసరావు, సిహెచ్ సుబ్రహ్మణ్యం, ఆర్ రమేష్,జి మోహనరావు, ఆయా గ్రామస్తులు సూర్యనారాయణ, వసంతరావు, ఆదిశేషు, సాయి, శివరామకృష్ణ, చిన్నం వెంకటేశ్వర రావు, సుబ్రహ్మణ్యం, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొల్లంపల్లి దర్గా వద్ద షీ టీం పోలీసుల అవగాహన సదస్సు

**నారాయణపేట, మే19 (నిఘా న్యూస్):** నారాయణపేట మండలం, కొల్లంపల్లి దర్గా వద్ద ప్రజలకు షి టీమ్ పోలీసులు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలను, చిన్న పిల్లలను వేధిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా షీ టీం పోలీసులు చెన్నయ్య, బాలరాజు లు మాట్లాడుతూ మహిళలకు షి టీమ్ పోలీసులు అండగా ఉంటారని మహిళలను, విద్యార్థులను, బాలికలను ఎవరైనా వేధించిన, శారీరకంగా మానసికంగా బాధపెట్టిన, ధైర్యంగా షి టీమ్ పోలీసులకు 8712670398 కు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి చట్ట ప్రకారం వేధించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఒకవేల సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షీ టీం పోలీసులు బాలరాజు, జ్యోతి, కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## ఈ నెల 22న హనుమాన్ జయంతి వేడుకలు

**కర్నూలు, మే19(నిఘా న్యూస్):** ఈ నెల 22న హనుమాన్ జయంతి వేడుకలను ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఐదు కేంద్రాలలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబందించిన బ్యానరు ను ధార్మిక సంస్థల ప్రతినిధుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓర్వకల్లులోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం, హొలగుందలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం, గోనెగండ్ల లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం, నందికొట్కూరు లోని శ్రీరామాలయం, జూపాడు బంగ్లా మండలం, పారుమంచాల గ్రామం లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు ఉదయం శ్రీఆంజనేయ స్వామివారి మూల మూర్తికి పంచామృతాభిషేకం, సింధూరాభిషేకం, ఆకుపూజ, విశేషార్చనలు, హనుమాన్ ఛాలీసా పారాయణం, భజనలు, సాయంత్రం నాలుగు గంటలకు యువతలో భక్తి భావన కలిగించి, శక్తిఉపాసకులవుటకు స్థానిక భక్తాదులచే శోభాయాత్రలు, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీనివాసులు, విశ్రాంత జిల్లా వైద్యాధికారి పూజారి మోక్షేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు టీడీపీ అధ్యక్షులుగా మునిరాజా ఎన్నిక



**శ్రీకాళహస్తి, మే 19 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం నూతన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రావిల్ల మునిరాజా నాయుడు. ఈ సందర్భంగా పలువురు ముని రాజాని ఘనంగా శాలువాతో సన్మానించారు.శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అభివృద్ధికి కృషి చేయాలని రానున్న రోజుల్లో పార్టీ బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మురళి నాయుడును శాలువాతో ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో చలపతి నాయుడు కన్నలి ప్రభాకర్ నాయుడు జై చంద్ర నాయుడు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుపతి ఐఐటిలో పరిశోధనా పద్ధతులపై సదస్సు




**శ్రీకాళహస్తి, మే 19 (నిఘా న్యూస్):** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతిలోని హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం, పరిశోధనా పద్ధతి, మల్టీవేరియేట్ డేటా విశ్లేషణపై ఐదు రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. ఈ వర్క్‌షాప్‌ను నేడు హెచ్ ఎస్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ బహినిపతి సమక్షంలో ఫ్యాకల్టీ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ముత్తుకుమార్ పళనిసామి ప్రారంభించారు. ఐటి క్యాంపస్‌లో జరిగే ఈ ఐదు రోజుల కార్యక్రమానికి యాభై మంది పైగా హాజరయ్యారు. ఇందులో పాల్గొనేవారు, ఎక్కువగా పీహెచ్‌డీ పరిశోధనా విద్యార్థులు దేశవ్యాప్తంగా ఉన్న ఫ్యాకల్టీ సభ్యులు హాజరవుతున్నారు. అంతే కాక ఇంజనీరింగ్, నిర్వహణ, లైఫ్ సైన్సెస్, హ్యూమానిటీస్‌తో సహా విభిన్న నేపథ్యాలకు చెందినవారు ఉన్నట్టు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌ను ఐఐటి తిరుపతిలోని హెచ్ ఎస్ ఎస్ విభాగ అధ్యాపక సభ్యులు డాక్టర్ వనీత్ కశ్యప్ మరియు డాక్టర్ విష్ణు సి. రాజన్ సమన్వయం చేస్తున్నారు.

## తూప్రాన్ గురుకులంలో సాఫ్ట్ బాల్ క్రీడలు

**ముఖ్య అతిథిగా హాజరైన డిఇఓ రాధాకృష్ణ**



**తూప్రాన్, మే 19 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ టోల్ ప్లాజా వద్ద ఉన్న తెలంగాణ గురుకుల పాఠశాలలో సాఫ్ట బాల్ క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడలకు ముఖ్య అతిథి అర్ డి ఓ జయచంద్ర రెడ్డి హాజరైయ్యారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కోడిప్యాక నారాయణ గుప్తా నేతృత్వంలో క్రీడలు ఏర్పాటు చేయడం జరిగింది. ఆర్ డి ఓ. జయ చంద్రరెడ్డి మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఆరోగ్యానికి మొదటి మెట్టు అని భావించాలి, మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అంత ఫిట్ గా ఉన్నారంటే క్రీడలు ఆడడం వలన కావచ్చు అని చమత్కరించారు. నిజంగా క్రీడలు ఆడడంతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం, ఆరోగ్యం, ఆయుష్షు ప్రమాణం మెరుగు పడుతుందని తెలిపారు, క్రీడాకారులు అన్ని క్రీడల్లో నైపుణ్యత కలిగి ఉండాలని రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా ఆడి ప్రథమ స్థానం సాధించాలని వారు కితాబిచ్చారు, ఇందులో డీఈవో రాధాకృష్ణ, ఇండియన్ క్రీడ విభాగం వైస్ ప్రెసిడెంట్ శోభన్ బాబు, తెలంగాణ సెక్రెటరీ నవీన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ గౌడ్, శ్యామ్ సుందర్, రాజేందర్, రేణుక మాజీ కౌన్సిలర్ భగవాన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తర తరాలూ మరచి పోలేని
# సుందరయ్య త్యాగ నిరతి

**విస్తృత ప్రజా ఉద్యమాలే ప్రజా సమస్యలకు పరిష్కారం**



**వైరా, మే 19 (నిఘా న్యూస్):** భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట రథ సారధి పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు పి.సామయ్య అన్నారు. సోమవారం సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బోడెపూడి భవనంలో పార్టీ పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు పి.సోమయ్య హాజరై పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమం నుంచి తెలంగాణ సాయుధ పోరాటం వరకు, అలాగే పార్లమెంట్లో ప్రజా ప్రతినిధిగా ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక సూచనలు, సలహాలు నెహ్రూ ప్రభుత్వానికి ఇచ్చిన గొప్ప మేధావి సుందరయ్య అన్నారు. దేశంలో, ప్రజల్లో అసమానతలు తొలగి పోవాలని తన కుటుంబ నుంచే ప్రారంభించి భారతదేశానికే గొప్ప ఆదర్శ కమ్యూనిస్టుగా సుందరయ్య నిలిచారని అన్నారు. సుందరయ్య మరణించేంతవరకు నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ, నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధ్యయనం చేస్తూ ప్రజలతో మమేకమై ప్రజా పోరాటాలు నిర్వహించారని, ప్రజా ఉద్యమాలను తనదైన శైలిలో పోరాటాలు నిర్వహించి ప్రజలకు ఆదర్శంగా నిలిచిన గొప్ప నాయకుడు అన్నారు. సుందరయ్య చనిపోయి 40 సంవత్సరాలే కాదు ఇంకెన్ని తరాలు వచ్చినా ప్రజలు సుందరయ్యను మరచిపోరని అన్నారు. ప్రజా పరిపాలనలో సుందరయ్యను ఊహించు కోకుండా ఏ ప్రభుత్వం కూడా ఉండబోదని అన్నారు. అందుకే సుందరయ్య నిరంతరం అధ్యయన శీలి అన్నారు. పోరాటాలు నిర్వహించడం ద్వారా సుందరయ్యకు నిజమైన నివాళులు అర్పించిన వాళ్ళము అవుతామని, రాబోయే కాలంలో ప్రజా ఉద్యమాలు రూపోందించి సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయాలని అన్నారు. అది సుందరయ్య వారసులుగా సిపిఐ(ఎం) పార్టీ కార్యకర్తలకే సాధ్యమన్నారు. అనంతరం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు నిర్వహించటం ప్రధాన కర్తవ్యంగా పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేరుగు సత్యనారాయణ, సుంకర సుధాకర్, పార్టీ రూరల్ మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, డివిజన్ కమిటీ సభ్యులు తోట నాగేశ్వరావు, పార్టీ సీనియర్ నాయకులు పారుపల్లి చంద్రశేఖర్ బాబు, పట్టణ నాయకులు బొంతు సమత, గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల మోహన్ రావు, గుమ్మా నరసింహారావు, రాచబంటి భత్తిరన్న, తోట కృష్ణవేణి, షేక్. నాగుల్ పాషా, కంసాని మల్లికాంబ, పాపగంటి రాంబాబు, యనమద్ది రామకృష్ణ, ఒర్సు సీతారాములు, మల్లెంపాటి రామారావు, మల్లెంపాటి ప్రసాదరావు, మాడపాటి మల్లికార్జున్ రావు, మాడపాటి వెంకటేశ్వరరావు, మందడపు రామారావు, పారుపల్లి శ్రీనాథ్ బాబు, వేల్పుల మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి 60లక్షల విరాళం

- భూమి పూజ నుండి ప్రారంభోత్సవం వరకు సంపూర్ణ సహకారం
- విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**తెల్లాపూర్, మే 19 (నిఘా న్యూస్):** పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి దేవాలయాల నిర్మాణాల అంశంలో తన దైవభక్తిని చాటుకుంటూనే ఉన్నారు. తాజాగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ నిర్మాణానికి 60 లక్షల రూపాయల భారీ విరాళం అందించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం నిర్మించాలని కోరుతూ స్థానిక విశ్వ బ్రాహ్మణులు విజ్ఞప్తి చేయడంతో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వంతో చర్చించి తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో విలువైన స్థలాన్ని గుడి నిర్మాణానికి కేటాయించడంలో కీలకపాత్ర పోషించారు. అనంతరం దేవాలయ నిర్మాణానికి ఉడతా భక్తిగా 60లక్షల రూపాయలు సొంత నిధులు అందించడంతో పాటుఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందించారు. సోమవారం ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులోనూ నియోజకవర్గం వ్యాప్తంగా దేవాలయం నిర్మాణాలకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. దేవాలయాలతో పాటు చర్చిలు, మసీదుల నిర్మాణానికి సైతం సంపూర్ణ సహకారం అందిస్తూ మత సామరస్యాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, శ్రీధర్ చారి, పిఎసిఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఇంద్రా రెడ్డి, వెంకటేష్ చారి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్యలు పరిష్కరించాలి

**జలమండలి అధికారులను ఘోరావ్ చేసిన బీజేపీ నేతలు**



**మల్కాజిగిరి, మే 19 (నిఘా న్యూస్):** డివిజన్ లలో నెలకొన్న డ్రైనేజీ, వాటర్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. సోమవారం మల్కాజిగిరి బీజేపీ నేతలు ఆధ్వర్యంలో ప్రజావాణి సందర్భంగా సైనికపురి డివిజన్ కార్యాలయంలో జలమండలి జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ ను, ఇతర అధికారులను ఘోరావ్ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగు నీటి సరఫరా 40 నిమిషాలకు మించి రావట్లేదు, కనీసం గంట వదలాలన్నారు. వాటర్ ట్యాంకర్లు చాలా ఆలస్యంగా వస్తున్నాయి, అనేక చోట్ల పాడైపోయిన పవర్ బోర్లు వెంటనే మరమ్మత్తు చేయిం చాలని కోరారు. నూతన భూగర్భ డ్రైనేజీ పనులు చాలా రోజులుగా పెండింగ్ లో వున్నవని వాటిని పూర్తి చెయ్యాలన్నారు. డ్రైనేజ్ చెత్తను వేంటనే ఎత్తి వేయించా లని, నీటి బిల్లులు ఇవ్వక సంవత్సరానికి ఒక్కసారి లక్షల్లో వేస్తున్నారు. నెలవారీ ఇవ్వాలిన్నారు. నివాస ప్రాంతాలకి కమర్షియల్ టారీఫ్ వేయడం సవరించాలని, ఓ.సీ ల పేరుతో నూతన కనెక్షన్స్ ఇవ్వడం లేదని, వాటిని సవరించి నూతన కనెక్షన్స్ ఇవ్వాలని కోరారు.దీనికి జనరల్ మేనేజర్ సునీల్ స్పందించారు. రెండు వారాల్లో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో బీజేపీ నాయకులు తమ నిరసన కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత, బీజేపీ నాయకులు ఉపేందర్ రెడ్డి,గోపు రమణా రెడ్డి,మాజీ కౌన్సిలర్ నిమ్మ కృష్ణారెడ్డి,కో కన్వీనర్ మల్లి కార్జున గౌడ్, బక్క నాగరాజు, పీఎస్ శేఖర్, డివిజన్ అధ్యక్షులు సోమా శ్రీనివాస్, ఆది త్య, సాయిబాబా, ఓం ప్రకాష్, వెంకట్ యాదవ్, నందు, మురళి కృష్ణ, జగదీష్ చారి, బాబాన్ సింగ్, సాయి సురేష్, శ్రీనివాస్, తూప్రాన్ లక్ష్మణ్ లతో పాటు అధిక సంఖ్యలో కాలనీ వాసులు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.



## జనమ్మకు పద్మశాలి సంఘం నివాళులు

**చిలుకానగర్, మే 19(నిఘా న్యూస్):** చిలుకానగర్ పద్మశాలి సంఘం కోశాధికారి పెండెం నాగార్జున మాతృమూర్తి జనమ్మ (86) మృతి చెందారు. సోమవారం చిలుకానగర్ పద్మశాలి సంఘం ప్రతినిధులు పద్మావతి నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి జనమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి నాగార్జున కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఆదర్శనగర్ స్మశాన వాటికలో జరిగిన అంత్యక్రియలలో సంఘ అధ్యక్షులు సకినాల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బెజగం శ్రీనివాసు, సంఘ పెద్దలు దేవసాని బాలచందర్, కుల పెద్ద సీనియర్ పాత్రికేయులు కిషోర్, దాసరి శ్రీను, నవీన్, డాక్టర్ బి.బి.రాజు, గూడ శ్రీశైలం, తాళ్ల శ్రీనివాస్, నర్సింగ్ నేత, పెద్ద బొమ్మ రమేష్, సకినాల దుర్గాప్రసాద్, చందు, సుల్తాన్, జగన్నాథం, శ్రీనివాసు, బడుగు రాములు బావనంద్, ఉద్యోగ సంఘాల నేతలు కుల సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## నాలాలలో చెత్తను వేయొద్దండి

**నాలా పూడికతీత పనులు పరిశీలించిన కార్పొరేటర్ ప్రేమ్ కుమార్**



**మల్కాజిగిరి, మే 19 (నిఘా న్యూస్):** నాలాలో చెత్తను పార వేయవద్దని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ సూచించారు. సోమవారం ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పి వి ఎన్ కాలనీ నుండి సత్య రాఘవేంద్ర కాలనీ వరకు చేపడుతున్న నాలా బకెట్ సిల్టింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని డివిజన్లో ఉన్న నాళాలలో డీ సెల్టింగ్ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, కిషోర్,ఉదయ్ కుమార్, జాలయ్య గౌడ్,వెంకటేశ్, జాయ్, శ్రీనివాస్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో నూతన డ్రైనేజీ పైపుల ఏర్పాటు







**మల్లాపూర్, మే 19 (నిఘా న్యూస్):** మల్లాపూర్ డివిజన్‌లోని నెహ్రూ నగర్ బ్లాక్-3లో కోన్ని నెలలుగా డ్రైనేజ్ పైపులు పగిలిపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నూతన పైపులు వేయడంతో నెహ్రూ నగర్ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. నూతన పైపులు వేయించడానికి కృషి చేసిన పరమేశ్వర్ రెడ్డి, కప్పర సాయికిరణ్ గౌడ్ లకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహర్, శేఖర్, జయంత్, ఉపేందర్ రెడ్డి, జోష్, ప్రకాష్, బస్తీ వాసులు పాల్గొన్నారు.



# శివ్వంపేటలో పోచమ్మ మైసమ్మను దర్శించుకున్న ఈటల





**హాజరైన కాంగ్రెస్ హరివర్ధన్ రెడ్డి వజ్రేష్ యాదవ్**

**మేడ్చల్, మే 19(నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు గ్రామంలోని శ్రీ శివ్వంపేట పోచమ్మ-మైసమ్మ జాతర ఉత్సవాలు గత వారం రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి.కాగా సోమవారం మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, టీపీసీసీ ఉపాధ్యక్షులు,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఏడాది మంచి వర్షాలు పడి రైతులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రజలందరూ చల్లగా ఉండేలా దీవించాలని అమ్మవార్లను కోరుకున్నట్లు తెలిపారు. పూజారి కార్తీక్ భవిష్యవాణి ఆకట్టుకునే విధంగా వినిపించారు. అనంతరం గావు, బలిగంప ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని మహిళలు, ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, సాయిపేట శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## రహదారి మరమ్మత్తులు చేపట్టండి

**మేడ్చల్, మే 19(నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని చెక్పోస్ట్ నుండి మజీద్ పూర్ వెళ్లే రహదారి అక్కడక్కడ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి గుంతలలో నీరు నిలవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఎప్పుడు ఇలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు ప్రమాదాలు జరగకముందే ఈ రోడ్డుపై ఏర్పడ గుంతలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు లేకుండా చూడాలి

### మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి



**మేడ్చల్, మే 19(నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూరు గ్రామంలో గల ఆదర్శ రైతు సేవా సహకార సంఘాన్ని సోమవారం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని,ఈక్రమంలో కొనుగోళ్లలో ఎలాంటి అవక తవకలు లేకుండా చూడాలని, అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఏఈఓ తేజస్విని రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ కౌడె మహేష్ కురుమ, తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాహుల్ యాదవ్, ఉమ్మడి మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సద్ది సుదర్శన్ రెడ్డి, వరద రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రకాష్ రెడ్డి, రాజు గౌడ్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్, నాయకులు, కార్యకర్తలు, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు

### మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ ఆకస్మిక తనిఖీలు



**మధిర, మే 19 (నిఘా న్యూస్):** ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ హెచ్చరించారు. సోమవారం మధిర పట్టణంలోని పలు హోటళ్లు,షాపింగ్ మాల్స్, బేకరీల్లో మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ తల్లి చౌరస్తాలో గల టిఫిన్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ దుకాణాదారులకు ఇప్పటికే కవర్లు అమ్మవద్దని,వాడవద్దని అవగాహన కల్పించినట్లు తెలిపారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించవద్దని,కవర్లు అమ్మితే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన నేలను ప్రకృతిని అందించాలంటే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తనిఖీల్లో మునిసిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గోతుల మయంగా గోల్నాక చౌరస్తా

### వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది



**అంబర్‌పేట, మే 19(నిఘా న్యూస్):** అంబర్ పేట గోల్నాక చౌరస్తాలో రోడ్డంతా గోతులమయంగా మారి వాహనాల రాకపోకులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం అంబర్ పేట ఫ్లైఓవర్ ప్రారంభం కావడంతో, గోల్నాక చౌరస్తాలో వాహనాల రద్దీ మరింతగా పెరిగింది. ప్రతినిత్యం ఉదయం సాయంత్రం వేళల్లో చౌరస్తాలో వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. దీనికి తోడు గోల్నాక మార్కెట్ వైపుకు వెళ్లే దారి, జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద రోడ్డంతా గోతుల మయంగా మారి వాహన దారులకు మరిన్ని కష్టాలు తెచ్చిపెడుతుంది. చౌరస్తాలో రోడ్డంతా పాడైపోవడంతో వాహనాలు మెల్లగా రాకపోకలు సాగిస్తూ ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. అక్కడి రోడ్డు దుస్థితిని గమనించిన అంబర్ పేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రావు ఇటీవల సిబ్బందితో గోతులలో మట్టి పోయించారు. రోడ్డు దుస్థితిపై ట్రాఫిక్ పోలీసులు స్పందించినప్పటికీ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే గోల్నాక చౌరస్తాలో పాడైపోయిన రోడ్డుకు మరమ్మతులు చేయాల్సిన జిహెచ్ఎంసి ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని వారు మండి పడుతున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరారు.

### బీటెక్ విద్యార్థిపై దాడి చేసిన

# నిందితులను అరెస్టు చేయండి



- దాడి చేసిన వారిపై కాకుండా మరొకరిపై కేసులు పెట్టడం దారుణం
- ఎస్పీ ప్రత్యేక విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలి
- తిరుపతి కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి

**తిరుపతి, మే 19 (నిఘా న్యూస్):** శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న జేమ్స్ అనే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తిరుపతి కాంగ్రెస్ పార్టీ నాయకులు యార్లపల్లి గోపి డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలంగా కులవివక్ష చూపిస్తూ,కొంతమంది రౌడీ షీటర్లతో కలిసి అత్యంత దారుణంగా కొట్టి,పలు విధాలుగా హింసించి, దాదాపు రోజంతా అతన్ని రాడ్లతో కొట్టి హత్యాయత్నం చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాల కావస్తున్న ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలకు దేశంలో ఎక్కడో ఒక ప్రాంతంలో ప్రతిరోజు అన్యాయమే జరుగుతుందని ఆయన ఆవేదన చెందారు.అలాగే దీనంతటికీ కారకుడైన యశ్వంత్ నాయుడు అనే కుల దురహంకార విద్యార్థినీ శాశ్వతంగా కాలేజీ నుండి తొలగించి మరే ఇతర కాలేజీలోనూ చదవడానికి అర్హతలేని విధంగా చూడాలని అన్నారు. ఇంతటి కులవివక్ష కలిగి,అత్యంత దుర్భరమైన, నీఛాతీనీచమైన మానసికస్థితి ఉన్నవారు విద్యార్థిగా ఉండడానికి అర్హులు కాదన్నారు. ఫిర్యాదు తీసుకునేందుకు పోలీస్ స్టేషన్ కు వెళ్లగా పోలీసులు నిరాకరించడం దారుణం అన్నారు. ఈ ఘటన జరిగిన తర్వాత బాధితుడు ఫిర్యాదు చేయడానికి పోలీసులను సంప్రదించగా కొందరు అతనికి సహకరించకపోగా, కేసు పక్కదారి పట్టించడానికి ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేయగా వారి పేర్లను తొలగించి మరొకరుపై కేసులు పెట్టడం సిగ్గుచేటు అన్నారు. అలాంటి పోలీసులపై జిల్లా ఎస్పీ శాఖాపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కాలేజీ యాజమాన్యం, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను ఏవిధంగానైనా హింసించినా, వారిని ఇబ్బందులకు గురిచేసినా, ఎంతటి వారైనా సరే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మించాల తేజోవతి, వెంకటేష్ గౌడ్, మసీద్ పటేల్, హేమంత్ పాల్గొన్నారు.

### ఆదరం గ్రామంలో..

# ఎంపీ నిధులతో వాటర్ ప్లాంట్ నిర్మాణం

### ప్రారంభించిన ఎంపీ గురుమూర్తి, సమన్వయ కర్త రాజేష్



**తిరుపతి, మే19 (నిఘా న్యూస్):** తిరుపతి పార్లమెంటు పరిధిలోని సత్యవేడు నియోజకవర్గం, కె.వి.బి.పురం మండలం ఆధరం గ్రామంలో ఎంపీ నిధులతో రూ.11.64 లక్షల వ్యయంతో నిర్మితమైన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు. గ్రామ మహిళా సర్పంచ్ రిబ్బన్ కట్ చేసి వాటర్ ప్లాంట్ ప్రారంభించగా, ఎంపీ గురుమూర్తి స్విచ్ నొక్కి వాటర్ ప్లాంట్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా నూకతోటి రాజేష్ మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచార సమయంలో గ్రామస్తులు విన్నవించిన త్రాగునీటి సమస్యను ఎంపీ గురుమూర్తి నిధులు కేటాయించి పరిష్కరించారని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన ఎంపీ గురుమూర్తికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ మంచి మెజారిటీ అందించిన సత్యవేడు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. నాడు ఇచ్చిన మాట ప్రకారం వాటర్ ప్లాంటు నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. అలాగే మరో సమస్య అయిన కాళంగి రిజర్వాయిర్ గేట్ల మరమ్మత్తు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను స్థానిక నాయకుల ద్వారా లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అక్రమ కేసుల విషయంలో పార్టీ లీగల్ సెల్ ద్వారా సహాయం అందిస్తామని కలిసి కట్టుగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అధికారుల పనితీరు పారదర్శకంగా ఉండాలని, లేకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

# పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లిన సుందరయ్య

### కామ్రేడ్ పుచ్చలపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి: పి.మంగ



**మల్కాజిగిరి, మే 19 (నిఘా న్యూస్)** కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యని ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం పార్టీ మల్కాజిగిరి మండల కమిటీ సభ్యురాలు పి.మంగ సూచించారు. సోమవారం మౌలాలి డివిజన్ పరిధిలోని పిల్లినరసింగ్ రావు నగర్ బస్తీలో కాలనీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి కార్యక్ర మంలో ఆమె పాల్గొని నివాళు లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయా లని పిలుపునిచ్చారు. సుందరయ్య విద్యార్థి దశలోనే కుల వివక్షతపై పోరాటం చేశారని, భూస్వా ములకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. దళితులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారని చెప్పారు. వీర తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించాడని, ఎక్కడికి వెళ్ళినా నడుచుకుంటూ వెళ్లేవారన్నారు. ఉద్యమ సమయంలో ఆయన ఎవరి ఇంటికి వెళ్ళినా కూడా ఆప్యాయంగా పలకరించే వారన్నారు. పార్లమెంట్లో గాని, అసెంబ్లీలో గాని చర్చల సమయంలో గణాంకలతో సహా వివరంగా అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించే వారన్నారు. పార్లమెంటుకి సైకిల్ మీద వెళ్లిన వ్యక్తి ఆయన ఒక్కడే అన్నారు. ఈయన ఊర్లో స్టోర్స్ నడిపి అందరికీ చౌకగా సరుకులు అందించే వారని, అదే విధంగా ఊర్లో వైద్య సహాయం కూడా ఈయనే స్వయంగా చేసేవారని తెలిపారు. సుందరయ్యను ఆదర్శంగా తీసుకొని కమ్యూనిస్టులు బలపడటానికి, ప్రజలతో మరింత మమేకం కావాల న్నారు. ఈ కార్యక్రమంలో రాజలక్ష్మి, అనూష, అనిత, షాహిద్, నరసమ్మ, లక్ష్మి, రజిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో... తుర్కపల్లి ఆర్ యుబీ పనులు ప్రారంభం

- నాలుగు కోట్ల వ్యయంతో పూర్తికానున్న నిర్మాణ పనులు
- దక్షిణ మధ్య రైల్వే రవి ప్రకాష్



**అల్వాల్, మే 19 (నిఘా న్యూస్):** అల్వాల్ పట్టణ పరిధిలోని తుర్కపల్లిలో రానున్న రెండు రోజులలో ఆర్ యు బి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని రైల్వే సెక్షన్ ఆఫీసర్ రవి ప్రకాష్ తెలిపారు. సోమవారం ఆయన, వివిధ విభాగాల అధికారులతో కలిసిఆర్ యుబీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కపల్లిలో ప్రజలకు రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ కష్టాలు తీరబోతున్నాయని తెలిపారు. సుమారు నాలుగు కోట్ల అంచనా వ్యయంతో ఆర్‌యుబి నిర్మాణం జరుగుతుందని తెలిపారు. అతి త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. అన్ని అనుకూలించి పరిస్థితులు సహకరిస్తే మరో తొమ్మిది నెలల్లో ఆర్ యుబీ పూర్తయితుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఉషన్ రెడ్డి, ఇంజనీర్ నరసింహారెడ్డి, జిహెచ్ఎంసి జలమండలి అధికారి సుజయ్, రమేష్, స్థానిక నాయకులు డోలి రమేష్, అనిల్ కిషోర్ గౌడ్, శోభన్ బాబు, ఢిల్లీ పరమేష్, దేవేందర్, జావిద్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష రూపాయల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్, మే 19 (నిఘా న్యూస్):** కాజీపేట బాపూజీ నగర్‌కి చెందిన దిద్ది నిర్మల మోకాలు చికిత్స కోసం నిమ్స్ హాస్పిటల్ లో చేరడంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వారికి చికిత్స కోసం లక్ష రూపాయల ఎల్ ఓ సి మంజూరు చేయించారు. ఈ సందర్భంగా బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యునికి ఎమ్మెల్యే ఎల్ఓసిని అందజేశారు. ఈ సందర్భంగా చికిత్స కోసం ఎల్ ఓ సి మంజూరు చేయించిన ఎమ్మెల్యే కి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సిరిల్ లారెన్స్, దొంగల కుమార్, ఇప్ప శ్రీకాంత్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన నన్నపునేని



**వరంగల్, మే 19 (నిఘా న్యూస్):** వరంగల్ తూర్పు నియోజకవర్గం 39వ డివిజన్ లోని లక్ష్మీ నగర్ లోని విశ్వకర్మ అభివృద్ధి సహకార సంఘం నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్. ఈ కార్యక్రమంలో 39 డివిజన్ ఇంచార్జ్ బజ్జురి వాసు బత్తుల కిషన్ గోరే చేరలు ఎండి అహ్మద్ అంకిన వినయ్ కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు యువజన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెూమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్





### మురికివాడల్లో నివసించే పేద పిల్లలకు ఆటపాటల్లో ప్రత్యేక శిక్షణ

**అంబర్‌పేట, మే 19(నిఘా న్యూస్):** పిల్లల్లో నాయకత్వ లక్షణాల స్థాయిని పెంచడమే కాకుండా వారిలో ఉన్న స్టేజీ ఫియర్ ను పోగొట్టడం, వారిలో వారికి తమపై నమ్మకాన్ని ఇంకా పెంచడం కోసం 'సయోధ్య' హెూమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ కృషి చేస్తున్నది. ఆనందకరమైన అభ్యాసం, సాధికారతను సయోధ్య సమ్మర్ క్యాంపులో పిల్లలకు చేకూరుస్తున్నది. మే ఒకటో తేదీ నుండి ఈ శిబిరం ప్రారంభమైంది. ప్రధానంగా మురికివాడల పిల్లల్లోని నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గత మూడేండ్లుగా ఈ సంస్థ పలు అంశాలలో శిబిరాన్ని నడుపుతున్నది. ఈసారీ పిల్లలకు డ్యాన్స్ తరగతులు నిర్వహిస్తున్నారు. గోల్నాక తులసీరాంనగర్(లంక)లో గల ప్రభుత్వ ప్రైమరీ స్కూల్లో చిన్నపిల్లలకు, ఆజాంపుర హైస్కూల్ భవనంలో, బతుకమ్మకుంట జీబీహెచ్ఎస్లో మూడు స్కూళ్లలో ఈ క్యాంపులను నడుపుతున్నారు. ఈ సమ్మర్ క్యాంపులో వంద మంది విద్యార్థులు నృత్యం నేర్చుకుంటున్నారు. పది సంవత్సరాల లోపు పిల్లలకు జూనియర్ చాంప్స్‌గా, 11 నుంచి 15సంవత్సరాల లోపు బాలికలకు సీనియర్ గర్ల్స్‌గా, 11సంవత్సరాల నుంచి 15సంవత్సరాల లోపు బాలురకు సీనియర్ బాయ్స్ గా విభజించారు. మూడు కేటగిరీలుగా డాన్స్ క్లాసులు తీసుకుంటున్నారు. ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు ఈ క్యాంపు ను నిర్వహిస్తున్నారు. ఇందులో వెస్టర్న్, హిప్ హెూప్ పాటలపై డాన్సు నేర్పిస్తున్నారు. పిల్లలు కూడా ఉత్సాహంగా ఉల్లాసంగా డాన్స్ నేర్చుకుంటున్నారు. సినీ ఫీల్డ్లో అనుభవం ఉన్న డాన్స్ మాస్టర్లు గణేష్, సంజు లు వీరికి డాన్స్ ను నేర్పిస్తున్నారు. అదేవిధంగా నృత్యంతో పాటు ధ్యానం, బోర్డు ఆటలు, సృజనాత్మక రచన, సైబర్సెక్యూరిటీపై అవగాహన, జీవిత నైపుణ్యాల అభివృద్ధి, వేద గణితం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఇంగ్లీష్ కమ్యూనికేషన్, పోస్కో చట్టం, సామాజిక సమస్యలపై అవగాహన వంటి అంశాలను ఇక్కడ పిల్లలకు నేర్పిస్తున్నారు. ఈ సమ్మర్ శిబిరానికి హాజరయ్యే పిల్లలకు సయోధ్య సంస్థ బ్రేక్ ఫాస్ట్ కూడా అందిస్తున్నది. మిల్లెట్ పాయసం, నట్ చిక్కి, ఉడికించిన గుడ్లతో సహా రోజువారి పోషకమైన స్నాక్స్ ఇస్తున్నారు.



పరిశుభ్రతపై అధికారుల దృష్టి సారించాలని అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని చెన్నారెడ్డి నగర్ లో స్థానిక జిహెచ్ఎంసి పారిశుధ్య విభాగం సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో పేరుకుపోయిన చెత్త కుప్పలను సిబ్బందితో శుభ్రం చేయించారు. డివిజన్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

– అంబర్‌పేట, మే 19(నిఘా న్యూస్):

## గజ్జెల రాంచందర్‌కు దళిత రత్న బిరుదు



**బాలాపూర్, మే 19, (నిఘా న్యూస్):** సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్ లో జరిగిన వేడుకల్లో మీర్పేట్ మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ కు రాష్ట్ర అంబేద్కర్ సంఘం ఛైర్మెన్ ఇటుక రాజు చేతులమీదుగా దళిత రత్న అవార్డు ఇచ్చి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ మీర్పేట్ కార్పొరేషన్ దళిత సంక్షేమ సమితి అధ్యక్షులు బైగళ్ల ఓం ప్రకాష్ అభ్యర్ధన, దళిత ప్రజాప్రతినిధిగా తాను చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డ్ ఇచ్చారని తెలిపారు. మున్ముందు కూడా ప్రజా సమస్యలపై పోరాడుతానని, ప్రజల కొరకు సేవలు చేస్తూనే ఉంటానని అన్నారు.

## శివాలయం పునర్నిర్మాణ వేడుకల్లో డీకే అరుణ పూజలు



**షాద్‌నగర్, మే 19(నిఘా న్యూస్):** ఆధ్యాత్మిక తత్వంతోనే గ్రామాల్లో ఐక్యత వెల్లివిరిస్తుందని స్నేహభావం పెంపొందిస్తుందని పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరుక్ నగర్ మండలం వెలిజర్ల గ్రామ బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట, గ్రామ శివాలయ దేవాలయ పునర్నిర్మాణం తదితర వేడుకలకు పాలమూరు పార్లమెంటు సభ్యులు డీకే అరుణ హాజరయ్యారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు డీకే అరుణతో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, మాజీ జెడ్పిటిసి మచ్చ సుధాకర్ రావు, షాద్ నగర్ పట్టణ అధ్యక్షుడు హరి భూషణ్, బిజెపి యువ నాయకులు వంశీకృష్ణ, మల్చలం మురళి, చెట్ల వెంకటేష్, మోహన్ సింగ్, శ్యాంసుందర్ రెడ్డి, కుడుముల బాలరాజ్, ఇస్నాటి శ్రీనివాస్, గిరిజన నాయకులు లష్కర్ నాయక్, రంగయ్య గౌడ్, ఎదిరా రాజు, బోయ అశోక్ మిద్దె గణేష్ మహేష్ అనిల్ కుమార్ గౌడ్ రాజు నాయక్ కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ గ్రామాలు శివాలయాన్ని పునర్నిర్మాణం చేయడం సంతోషకరమైన విషయమని గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన ఎంతో ముఖ్యమని తెలిపారు. గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఈ గ్రామంలో భారతీయ జనతా పార్టీకి మంచి మెజార్టీ లభించిందని ఈ సందర్భంగా డీకే అరుణ ధన్యవాదాలు తెలిపారు.

## విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ తరగతులు ప్రారంభం

**పేద, మధ్యతరగతి విద్యార్థులకు చేయూత**

**కోఆర్డినేటర్ చంద్రారెడ్డి**



**తూప్రాన్, మే 19 (నిఘా న్యూస్):** పేద మధ్యతరగతి విద్యార్థినీ విద్యార్థుల కోసం ఉన్నత విద్యను అభ్యసించే విధంగా విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ ఇండియా, వి ఎస్ టి ఇండస్ట్రీ వారి సహకారంతో తూప్రాన్ బాయ్స్, గర్ల్స్, పాఠశాలలో కావలసిన వసతులను ఏర్పాటు చేయడం జరిగింది. బ్రాహ్మణపల్లి కొండాపూర్ పాఠశాలలో విద్య కై ప్రత్యేక గదులను నిర్మించడం ప్రత్యేకంగా మూడు లక్షల నిధులతో నూతన వసతులకు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా తూప్రాన్ కొండాపూర్ పాఠశాలలో డిజిటల్ విద్యను ప్రారంభించారు. ముఖ్యంగా ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్, సబ్జెక్టులలో గొప్ప నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులచే విద్యాబోధన అందించే బృహత్తర కార్యక్రమానికి విశ్వ ఫౌండేషన్ వారు శ్రీకారం చుట్టారు. ఇందులో పేద, మధ్యతరగతి విద్యార్థులు కావలసిన విద్యతో పాటు తినుటకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారని విశ్వ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ చంద్రారెడ్డి తెలిపారు.

# సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

**వలిగొండలో సుందరయ్య 40వ వర్ధంతి**



**వలిగొండ, మే 19(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ భూస్వామ్య కుటుంబంలో పుట్టి పెరిగిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితాంతం పేదలు వ్యవసాయ కూలీల,కార్మికుల, పేద ప్రజల కోసం పనిచేసిన గొప్ప మహనీయుడని ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పంగి స్వామి మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టి పెరిగిన పుచ్చలపల్లి సుందరయ్య పేద ప్రజలు వ్యవసాయ కూలీలు, కార్మికుల,దళితుల కోసం తన జీవితాన్ని అంకితం చేశాడన్నారు. ఉత్తమ పార్లమెంట్ సభ్యునిగా సైకిల్ పై వెళ్లి రాజకీయాల్లో అందరికీ ఆదర్శంగా నిలిచిన గొప్ప నాయకుడన్నారు. పిల్లలు పుడితే తనలో స్వార్థం పెరుగుతుందనే భావనతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని తన జీవితం మొత్తం పేదల కోసం పనిచేసిన త్యాగమూర్తన్నారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో బాల్య దశలోనే పోరాటాలకు ఉత్తేజితులై కమ్యూనిస్టు పార్టీలో చేరి దక్షిణ భారతదేశంలో సిపిఎం నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని సిపిఎం మొదటి జాతీయ కార్యదర్శిగా పనిచేశారని ఎంపీ,ఎమ్మెల్యేగా పార్లమెంటు,అసెంబ్లీలో చట్టసభలకు వన్నెతెచ్చిన రాజకీయ సిద్ధాంతకర్త అన్నారు. ఆయన స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమైందని ఆయన చూపిన దోపిడీ,పీడనలేని సమ సమాజం కోసం,కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళని,ఆయన ఆశయ సాధనకు పునరంకితం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కందడి సత్తిరెడ్డి, మండల కమిటీ సభ్యులు కలుకూరి రామచంద్రర్, పట్టణ శాఖ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు కొండూరు సత్తయ్య,శీలం ఇందిర, మాడుగుల వెంకటేశం,మైసొల్ల నరేందర్, శోభ,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మలో రాజకీయ జోక్యాన్ని నివారించండి



**ఖమ్మం, మే 19(నిఘా న్యూస్):** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్దిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని సిపిఐ నగర సమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కలెక్టర్ ను సోమ వారం కలిసి వినతి పత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా మాట్లా డుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన జరగలేద న్నారు. పేదలకు సంబంధించి సంక్షేమ పథకాల అమలులో రాజకీయ జోక్యాన్ని నివారించాలని కలెక్టర్‌ను కోరినట్లు జానిమియా తెలిపారు.దశాబ్ద కాలంలో ఖమ్మం జనాభా గణనీయంగా పెరిగిం దని ఇందులో పేదలే ఎక్కువగా వలస వచ్చారని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల్లో పేదలకు ప్రాధాన్యతనివ్వాలని లబ్దిదారుల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని నివారించాలన్నారు.రేషన్ కార్డులు విడుదల చేయక, సవరణలు లేక దశాబ్ద కాలం గడిచిందని తక్షణం కొత్త రేషన్ కార్డు విడుదల చేయడంతో పాటు సవరణకు అవకాశం కల్పించాలని మీ ద్వారా పింఛన్ల పెంపు, కొత్త పింఛన్లు విడుదల చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.వినతి పత్రం సమర్పించిన వారిలో కార్పోరేటర్ బిజి క్లైమెంట్, మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, సిపిఐ ఏరియా కార్యదర్శులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఏనుగు గాంధీ,గాదె లక్ష్మి నారాయణ, సైదా, పీట్ల కృష్ణమూర్తి, వరదా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్య చిత్రపటానికి ఘన నివాళులు : సిఐటియు



**ఉప్పల్, మే 19 (నిఘా న్యూస్):** పీడిత ప్రజల నాయకుడు, దక్షణాది భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సిపిఎం వ్యవస్థాపక కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని ఉప్పల్ బీరప్ప గడ్డలోని సిఐటియు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ నేటి రాజకీయాలు మతం, కులం, ప్రాంతం పేరుతో యువతను తప్పుదోవ పట్టించే విధంగా మారటం చాలా బాధాకరం అని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య లాంటి ఉన్నతమైన రాజకీయాలు చేసే నాయకులు రావాలని, సోషలిస్టు సమాజం రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం వినోద, ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న, సిపిఎం పార్టీ నాయకులు వెంకటేష్, ప్రభాకర్, సుగుణమ్మ, శశి, నవీన్, సాయి, భాను తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం పంపిణీ చేసిన నాగార్జున డెయిరీ



**హుజురాబాద్, మే 19 (నిఘా న్యూస్):** హుజురాబాద్ పట్టణం లోని హైస్కూల్ గ్రౌండ్ ఆవరణలో జరుగుతున్న బాలబాలికల వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులకు శనివారం నాగార్జున డెయిరీ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. నాగార్జున డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆకునూరి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అరటిపండ్లు కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వాకర్స్ క్లబ్ సభ్యులు, అధ్యక్షులు పాల్గొని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించినందుకు నాగార్జున డెయిరీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు శిక్షణతో పాటు ఇలాంటి పౌష్టికాహారం అందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏజీఎం ఆకునూరి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ నాగార్జున డెయిరీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత

**సుందరయ్య వర్ధంతి వేడుకల్లో సిపిఎం నాయకులు డి.జగదీష్**




**రాజేంద్రనగర్, మే 19(నిఘా న్యూస్):** దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు డి.జగదీష్, అన్నారు. మండల కార్యదర్శి దప్పు ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన పుచ్చలపల్లి సుందరయ్య 40.వ వర్ధంతి సంద ర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుందరయ్య జీవితం కేవలం ఒకే ప్రాంతాన్ని కాకుండ దక్షిణ భారతదేశ మంత కమ్యూనిస్టు ఉద్యమాన్ని వ్యవసాయ కార్మికులు కూలీలు రైతుల భూములు సమస్యలు ప్రజల సమస్యలు వారి జీవన విధానాలను మార్పు కొరకు సుందరయ్య ప్రజలందరినీ చైతన్యపరిచాడని కొనియాడారు. దున్నే వాడికి భూమి కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని వందల ఎకరాలు పేదలకు పంచాడని అన్నారు. వ్యవసాయ రంగంలో నూతన వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి రైతుకు భూమి లేకుండా చేయాలని కుట్ర మోడీ ప్రభుత్వం చేస్తుందని వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. అనేక సంవత్సరాల నుంచి పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోళ్లు తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని స్వతంత్ర కాలంలో సాధించుకున్న హక్కులను కాపాడుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు మండల కమిటీ సభ్యులు అశోక్ నాగేష్ గౌడ్ రఘు పురుషోత్తం చారి శామప్ప కార్మికులు పాల్గొనడం జరిగింది.

## దళితుల ఆలయ ప్రవేశం అడ్డుకోవడం దారుణం




**గంగవరం, మే 19(నిఘా న్యూస్):** గంగవరం మండలం కీలపల్లి పంచాయతీ పొన్నమాకులపల్లి గ్రామ దళితులను ఆలయ ప్రవేశం అడ్డుకున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిపై చర్యలు తీసుకొవాలని జాతీయ మానవ హక్కులు అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా నాయకులు డి.వి .మునిరత్నం, సోమరాజు డిమాండ్ చేశారు. అందులో భాగంగా సోమవారం పలమనేరు పట్టణంలోని జాతీయ మానవ హక్కుల కార్యాలయం నందు సరస్వతి అధ్యక్షతన ఈ విషయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం వచ్చి 75సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ దళితులను వివక్షకు గురి చేస్తూ అవమానిస్తు న్నారని ఘాటుగా విమర్శించారు. పొన్నమాకులపల్లి దళితులు ఈనెల 14వ తేదీ గ్రామంలో నిర్మించిన చెన్నకేశవ స్వామి దేవాలయంలోకి గ్రామస్తులతో పాటు దళితులు పూజ సామాగ్రిని తీసుకెళ్లి పూజలు నిర్వహించడానికి ప్రయత్నిస్తే గ్రామంలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన సుమారు 15మంది దళితులను అడ్డుకొని పూజలు చేయనివ్వ కుండా అవమానపరిచి తిరిగి ఇంటికి పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై ప్రత్యక్షంగా అవమానాలు జరుగుతుంటే పాలకవర్గాలు, అధికారులు చోద్యం చోద్యం చూస్తున్నారు అని వారు ఆందోళన వ్యక్తపరిచారు.

## పేద యువతి పెళ్లికి పుస్తె మట్టెల సాయం



**రామన్నపేట, మే 19(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన నిరుపేద యువతి పెళ్లికి కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు కందిమల్ల గోపాల్ రెడ్డి ఆర్థికంగా సాయం చేసి దాతృత్వం చాటుకున్నాడు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకులు నోముల కృష్ణ చెల్లెలు పుష్పలత అనే యువతికి పెళ్లి నిశ్చయమైంది. నిరుపేద కావడంతో విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కందిమల్ల గోపాల్ రెడ్డి సహాయం చేసేందుకు ముందుకొచ్చాడు. శ్రీ సాయిరామ ఫంక్షన్ హాల్ రామన్నపేట లో జరిగిన వివాహంలో పాల్గొని పెళ్లి కుమార్తె పుష్పలత కు పుస్తే మెట్టెలు, పెళ్లి చీరను అందజేశారు. నిరుపేద కుటుంబానికి సహాయం చేసిన కందిమల్ల గోపాల్ రెడ్డి ని పెళ్లి కుమార్తె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల శివ, నోముల స్వామి, చిప్పలపల్లి స్వామి, నోముల శివ, చిప్పలపల్లి ఉపేందర్, సుర్వి శివ, నోముల శంకర్, నోముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండలో జై కిసాన్ ఫెర్టిలైజర్స్ షాప్ ప్రారంభం



**వలిగొండ, మే 19(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో గాంధీ విగ్రహం పక్కన నూతనంగా జై కిసాన్ ట్రేడర్స్, ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ షాపును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యజమానులు మాట్లాడుతూ మన వెలువర్తి గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా నూతనంగా జై కిసాన్ ట్రేడర్స్, ఫెర్టిలైజర్స్ షాపును ప్రారంభించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. గ్రామంలోని చుట్టుపక్కల రైతు సోదరులకు కావాల్సిన అన్ని రకముల ఎరువులు, విత్తనాలు పురుగు మందులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని ఈ ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాప్ యజమానులు లక్ష్మణ్, జానీ, మాజీ ఎంపీటీసీ లు ఎడవెల్లి సత్తమ్మ యాదయ్య, గుండు శేఖర్, రైతులు దొడ్డు రమేష్, కల్లూరి చంద్రయ్య, ఉక్కుర్తి స్వామి, వెంకటయ్య గౌడ్, ఆగ్రో ఎంప్లాయ్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఫెర్టిలైజర్ షాప్ దగ్ధం



**ఇల్లందు, మే 19 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణంలోని స్థానిక జగదాంబ సెంటర్‌లో గల శ్రీ ఆదిత్య సాయి ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాప్ ఆదివారం రాత్రి సుమారు 12గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యవసాయానికి ఉపయోగపడే ఎరువులు పురుగు మందులు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రెండు కోట్ల 70 లక్షల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లింది. అప్పటికే సరుకు పూర్తిగా కాలిపోవడంతో షాప్ యజమాని, కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖసాగరంలోకి వెళ్లారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు హుటా హుటిన స్పందించి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



రాజీవ్ యువ వికాసం ఎంపికలో మైనారిటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని టి పిసిసి లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ మొయినుద్దీన్ విజ్ఞప్తి చేశారు. తన వినతి పత్రాన్ని రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కు అందజేశారు.

– ముషీరాబాద్, మే 19 (నిఘా న్యూస్):

## మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదల

### నేటి నుంచి ప్రవేశాలు ప్రారంభం




**కారేపల్లి, మే 19 (నిఘా న్యూస్):** తెలంగాణ మోడల్ స్కూళ్లలో 6 వ తరగతితో పాటు 7,8,9,10 తరగతులలో ఖాళీగా ఉన్నా సీట్లకు ఈనెల 27న నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదల అయినట్లు సింగరేణి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రవేశ పరీకా ఫలితాల మెరిట్ జాబితాను పాఠశాల నోటీస్ బోర్డుపై ఉంచినట్లు తెలిపారు. ప్రవేశం పొందగోరే విద్యార్థులు తమ ఒరిజినల్ విద్యార్హత ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, కులం, ఆధాయ ధృవీకరణ పత్రాలు, మూడు పాస్ ఫోటోలు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. ప్రవేశాలను ఈనెల 20వ తేది నుండి జూన్ 1వ తేదిలోపు ఉంటుందన్నారు. విద్యార్థులు వెంటనే రిపోర్టు చేయాలని కోరారు.

## దమ్మపేట తహసిల్దార్‌గా భగవాన్ రెడ్డి



**దమ్మపేట, మే 19 (నిఘా న్యూస్):** దమ్మపేట మండలం నూతన తహసీల్దారుగా బి భగవాన్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత ఆరు నెలలుగా పూర్తిస్థాయిలో తాహాసిల్దార్ లేకపోవడంతో డీటీగా పనిచేస్తున్న వాణి ఇన్చార్జ్ తాహాసిల్దార్ గా బాధ్యతలు నిర్వర్తిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ప్రభుత్వం దమ్మపేట మండలం తాహాసిల్దార్ గా బి. భగవాన్ రెడ్డిని నియమించడంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో పలువురు గ్రామస్థులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియపరిచారు.

## ఉసిర్ల గూడెంలో కోదండ స్వామి విగ్రహ ప్రతిష్ట

### అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు



**అశ్వారావుపేట, మే 19 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట మండలం ఉసిర్లగూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతా సమేత కోదండ స్వామి, పరివార దేవత సమేత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బుర్గంపహాడ్ అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు పాల్గొని ఆ స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అంకిత మల్లికార్జునరావు, తాండ్ర యుగేందర్, ప్రతాప్, తొట్టి మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**మోటకొండూరు, మే 19 (నిఘా న్యూస్):** మోటకొండూరు మండలం మండల కేంద్రంలోని మంచినీటి శుద్ధికరణ కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మూటకొండూరు మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లెంల సంజీవరెడ్డి, ఆలేరు ఎఎంసి వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదర్ గౌడ్, మూట కొండూరు మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అఖిలపక్ష నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున సాగుతం పలికారు.

## మృతి చెందిన వీఆర్ఏ కుటుంబానికి గౌసుద్దీన్ సాయం

**కారేపల్లి, మే 19 (నిఘా న్యూస్):** సింగరేణి మండల కేంద్రానికి చెందిన వీఆర్ఏ వేమూరి వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎస్కె.గౌసుద్దీన్ సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. వెంకన్న కుటుంబాన్ని పరామర్శించిన గౌసుద్దీన్ కుటుంబానికి రూ.5వేల నగదు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి సానుభూతిని తెలిపారు. బాధితులకు అండగా ఉంటూ సాయం అందిస్తున్న గౌసుద్దీన్ సేవలను గ్రామస్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మణిగొండ నాగేశ్వరరావు, ఖలీలుల్లాఖాన్, చెవుల అనిల్‌కుమార్, నాగమణి, ఉదయ్, నరేష్, అబ్దుల్ వాయిబ్, కాంతయ్య, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



# సకాలంలో సమస్యలు పరిష్కరిస్తేనే గౌరవం దక్కుతుంది

### తహసీల్దార్ వై.వెంకటేష్ కు వీడ్కోలు సన్మానం



**తాండూరు, మే 19 (నిఘా న్యూస్):** బషీరాబాద్ మండల కేంద్రంలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో బషీరాబాద్ మండల తహసీల్దార్ గా విధులు నిర్వహించిన మండల తహసీల్దార్ వై.వెంకటేష్ బదిలీపై సంగారెడ్డి జిల్లాకు వెళ్లడంతో ఉప తహసిల్దార్ రుక్సాన బేగం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగార్జున రెడ్డి, జూనియర్ సహాయకులు నవీన్, అంజిలప్ప గోవింద్, రికార్డ్ సహాయకులు నర్సమ్మ, మున్నప్ప, బిచ్చప్ప, మండల తహసీల్దార్ వై. వెంకటేష్‌కు శాలవలతో , పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ రుక్సానా బేగం, కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. వారు 16 నెలల పాటు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారని, వారి ద్వారా కార్యాలయం పనులను సకాలంలో పూర్తిచేయడం చేయడం నేర్చుకున్నామని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ వై.వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి కార్యాలయ సిబ్బంది అందరూ కృషి చేయాలని కోపంతో మాట్లాడిన, అది మార్గదర్శకంగా భావించాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు.

ప్రజలు సమస్యల పరిష్కారం గురించి కార్యాలయానికి అధికసార్లు తిరగ రాదనే సదుద్దేశంతో, తాను ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలనీ కార్యాలయ సిబ్బందితో కఠినంగా ఉండడం జరిగేదని తెలిపారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, వృత్తికి న్యాయం చేసిన వారమవుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖండ్రిగ గ్రామంలో వెంకటేశ్వర స్వామి కుంభాభిషేకం



**తిరుపతి, మే19 (నిఘా న్యూస్):** సత్యవేడు నియోజకవర్గం, సత్యవేడు మండలంలోని ఓబులురాజు ఖండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సత్యవేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులకు గ్రామస్థులు హారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సంప్రదాయ పద్ధతిలో పౌరోహితులు పూజలు నిర్వహించి హారతి,తీర్థ ప్రసాదాల అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు బీరేంద్ర వర్మ, సుశీల్ కుమార్ రెడ్డి,నిరంజన్ రెడ్డి,భాను ప్రకాష్ రెడ్డి, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు వేలూరు రాకేష్, రమేష్ రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన ఎంపీ కావ్య



వరంగల్, మే 19 (నిఘా న్యూస్): ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేందుకు సీఎం సహాయనిధి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఈ సీఎం ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం హన్మకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు 3 లక్షల 94 వేల 500 రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసారు. ప్రజా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తుందని ఎంపీ అన్నారు. ఈ సందర్భంగా చెక్కు మంజూరు కోసం సహకారాలు అందించిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్సీపురం టిడిపి అధ్యక్షుడిగా తిరుమల రెడ్డి



**రామచంద్రపురం, మే19 (నిఘా న్యూస్):** ఆర్సి పురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా రాయలచెరువు పేట గ్రామానికి చెందిన మేకల తిరుమలరెడ్డిని తిరిగి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మిట్టూరు కమ్యూనిటీ హాల్లో టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకులు వి గణపతి నాయుడు, భాస్కర్ రెడ్డి, ఒంటి మునిశేఖర్ రాయల్ మండల టిడిపి కమిటీని ప్రకటించారు.

మండల టిడిపి ఉపాధ్యక్షులుగా కే.గిరిధర్ రెడ్డి, టి.మురళీమోహన్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా రావిళ్ళ గిరినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎన్ కమలాకర్ రెడ్డి, కె.రాఘవేంద్ర నాయుడు, టీ.వెంకటేష్ రెడ్డి, కార్యదర్శులుగా పంతల వెంకటేష్ నాయుడు, సి.రవి ప్రసాద్,వాసు యాదవ్, కోశాధికారిగా మధుసూదన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో కె.ధనంజయ చౌదరి,లెక్కల మహేష్ నాయుడు,దినేష్ చౌదరి, కే ముద్దుకృష్ణారెడ్డి చిరంజీవి, బండి విజయ్ కుమార్ రెడ్డి, ఆకా దేవరాజులు, బి రమణారెడ్డి, నాగభూషణం, మహిళా నాయకురాలు సుగుణమ్మ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణికి హాజరు కాని అధికారులపై ఫిర్యాదు

### కారేపల్లి తహసీల్దార్ సంపత్ కుమార్



**కారేపల్లి, మే 19 (నిఘా న్యూస్):** కారేపల్లి మండలంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు పిర్యాదు చేయనున్నట్లు తహసీల్దార్ సంపత్‌కుమార్ తెలిపారు. మండల స్థాయిలో పరిష్కారం దొరికే ప్రజా సమస్యలను మండలంలోనే పరిష్కరించటానికి ఏర్పాటు చేసిన ప్రజావాణికి కొందరు అధికారులు హాజరు కావటం లేదన్నారు. వారి వివరాలను కలెక్టర్‌కు నివేదించట జరుగుతుందన్నారు. ప్రజలు అందజేసిన పిర్యాదులు, అభ్యర్ధలను అయా శాఖల అధికారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కారేపల్లిలో స్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని కారేపల్లి రైల్వే బోర్డు సభ్యులు తురక నారాయణ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నీరు, విద్యుత్, షెడ్ రిపేరు వంటి వాటిని చేయించాలని కోరారు.

## ఘనంగా త్యాగరాజ స్వామి ఏడవ సంగీతోత్సవం

### ముఖ్యఅతిథిగా హాజరైన పులివర్తి సుధా రెడ్డి



**చంద్రగిరి, మే19 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పాకాల పట్టణం రైల్వే ఇన్ స్టిట్యూట్ నందు నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఏడవ సంగీతోత్సవం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి,టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి విచ్చేశారు. అనంతరం పాకాల రైల్వే ఇన్ స్టిట్యూట్‌లో నిర్వహించిన ఏడవ సంగీతోత్సవాన్ని పులివర్తి సుధారెడ్డి తిలకించారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, టిడిపి చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సావిత్రి, శానంబట్ల మీన, శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ మెంబర్ ఎస్.లలిత, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక్ నగర్‌లో నీటి ఎద్దడిని తీర్చండి

### మైలార్దేవపల్లి డివిజన్ బిఆర్ఎస్ నేతలు



**రాజేంద్రనగర్, మే 19(నిఘా న్యూస్):** మైలార్దేవపల్లి డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ లో త్రాగు నీరు, సివరేజస్ పైప్ లైన్లు లేక అక్కడి నివాసితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు పలుమార్లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరించిన పట్టించుకోలేదని మైలార్దేవపల్లి డివిజన్ బిఆర్ఎస్ నేతలు అన్నారు.ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజేంద్రనగర్ వాటర్ బోర్డ్ జీఎం సాయిలక్ష్మిని కలసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు. స్పందించిన జీఎం సాయిలక్ష్మి నేరుగా తానే వినాయక్ నగర్ బస్తీల్లో పర్యటించి సమస్యలను పరిశీలించి పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మైలార్దేవపల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్,ఎన్. రాము యాదవ్, రాఘవేందర్ యాదవ్,చిరంజీవి అరుణ్ ముదిరాజ్, భూదేవి,అశోక్, కుమార్,సురేష్, ముదిరాజ్,నరేష్ యాదవ్ పాల్గొన్నారు.

## భువనగిరిలో నేడు తిరంగా యాత్ర

### హాజరు కానున్న ఎంపీ ఈటల రాజేందర్



**భువనగిరి, మే 19 (నిఘా న్యూస్):** భువనగిరిలో నేటి మంగళవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారత సైనికులకు మద్దతుగా తిరంగా యాత్ర చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున ఇట్టి కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర జిల్లా సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ పిలుపునిచ్చారు.

## మంత్రి టీజీ భరత్‌ను కలిసిన వంగపల్లి



**ఆలేరు, మే 19 (నిఘా న్యూస్):** యాదగిరిగుట్ట మండలం కాచారం రేణుక ఎల్లమ్మ ఆలే ఆశ్రమ నిర్వాహకులు ఆధ్యాత్మికవేత్త వాసవి ఉపాసకులు డాక్టర్ రంగపల్లి ఆంజనేయస్వామి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల మంత్రి టిజి భరత్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## హెూటళ్లు, పండ్ల దుకాణాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



**అంబర్‌పేట, మే 19(నిఘా న్యూస్):** అంబర్ పేట పరిసరాల్లోని పలు హెూటళ్లు, పండ్లను నిల్వ ఉంచే గోదాముల్లో ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ అడిషనల్ డిసిపి అందే శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్ నాగార్జున నేతృత్వంలో ఎస్సై కరుణాకర్ రెడ్డి సిబ్బంది, జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా అంబర్ పేట మెయిన్ రోడ్డు లో గల విక్టోరియా హెూటల్లో తనిఖీలు నిర్వహించారు. కిచెన్ గది అద్వానంగా ఉండడంతో పాటు ఆహార పదార్థాలు నిలువ ఉంచారు. అలాగే అలీకేఫ్ లోని శివానంద్ హెూటల్ లో కూడా తనిఖీలు చేశారు. తర్వాత న్యూ అంబేద్కర్ నగర్‌లో గల కేజీఎన్ ఫ్రూట్ గోదాంలో కూడా తనిఖీలు చేశారు.అక్కడ మామిడి పండ్లు తొందరగా పక్వానికి వచ్చేందుకు ఉపయోగిస్తున్న ఇథేనాల్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నారు. రెండు హెూటళ్లు, ఈ గోదాంపై కేసులు నమోదు చేశారు.

## ఇళ్ల పట్టాల కోసం సిపిఐ ఆందోళన




**విశాఖపట్నం, మే 19 (నిఘా న్యూస్):** పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, ఇళ్ల స్థలాలు పట్టాలిచ్చి ఐదు లక్షలు ఉచితంగా మంజూరు చేసి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ సిపిఐ ఆరిలోవ మధురవాడ శాఖల ఆధ్వర్యంలో విశాఖ రూరల్ మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టింది. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పైడి రాజు జిల్లా కార్యదర్శి రెహమాన్ మాట్లాడుతూ సొంతఇల్లు కల నిజం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## కారు నేర్చుకుంటూ బాలుడి ప్రాణం తీసిన మహిళ



**అమీన్‌పూర్, మే 19 (నిఘా న్యూస్):** కనీస డ్రైవింగ్ శిక్షణ తీసుకోకుండా సొంత కారులో భర్తతో కలిసి డ్రైవింగ్ వెళ్ళి గ్రౌండ్ లో ఆడుకుంటున్న ఇద్దరు పిల్లల పైకి కారును తీసుకుని వెళ్ళిన ఘటన అమీన్ పూర్‌లో విషాదం నింపింది. స్థానికుల నుంచి అందుతున్న సమాచారం మేరకు అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని నర్రేగూడెం నివాసి శేఖర్ (40) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తమ కుటుంబంతో నివసిస్తున్నాడు. శేఖర్ కూతురు ఏకవాణి (14), కుమారుడు మణిధర్ వర్మ(10), ఆదివారం సాయంత్రం నర్రేగూడెం గ్రౌండ్‌లో ఆడుకుంటున్నారు. అదే సమయంలో నవ్య కాలనీలో నివాసం ఉంటున్న మహేశ్వరి ఆమె భర్త రవిశేఖర్ తో కలిసి తమ కారులో డ్రైవింగ్ నేర్చుకోవడానికి గ్రౌండ్ కు చేరుకుంది. గ్రౌండ్ లో అజాగ్రత్తగా కారు నడపడంతో పిల్లల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో గ్రౌండ్‌లో ఆడుకుంటున్న ఏకవాణి, మణిధర్ వర్మలు తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మణిధర్ వర్మ మరణించాడని వైద్యులు ధృవీకరించారు. మణిధర్ సోదరి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మృతి చెందిన బాలుని మృతదేహాన్ని పటాన్ చేరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

## పాల టాంకర్‌ను ఢీ కొట్టిన టిప్పర్ : డ్రైవర్ మృతి



**అబ్దుల్లాపూర్‌మెట్, మే 19(నిఘా న్యూస్):** ఆగి ఉన్న పాల ట్యాంకర్ ను టిప్పర్ డ్రైవర్ వెనకనుండి ఢీకొట్టడంతో టిప్పర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన సోమవారం అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెస్ట్ బెంగాల్ రాష్ట్రం, హౌరా జిల్లా, గౌబేరియా డీ.ఎస్ లేన్ లో నివాసం ఉండే ఎండి.యు అలీ(40), టిప్పర్ (టిజి 07టి 1329) డ్రైవర్ సోమవారం తెల్లవారుజామున పెద్దఅంబర్ పేట్ ఓఆర్ ఆర్ నుండి ఘట్కేసర్ వైపు వెళుతున్నాడు. కాగా లారీ డ్రైవర్ పెద్దఅంబర్ పేట్ ఎక్సిట్ నం 11 వద్ద టోల్ గేట్ దాటిన తర్వాత ఓ ఆర్ఆర్ పై అజాగ్రత్తగా, ఎటువంటి సూచిక బోర్డు లేకుండా నిలిపి ఉన్న తిరుమల పాల ట్యాంకర్(టిఎన్ 52 హెచ్ 7869)ను లారీ డ్రైవర్ ఎండి.యు అలీ గమనించక వెనుక నుండి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్ అక్కడిక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతేహాన్ని ఉస్మానియాకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# హుజురాబాద్‌లో.. ఆగని కబ్జాలు



- **కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులు బుట్ట దాఖలు**
- **అధికారుల నిర్లక్ష్యంతో అంతరించనున్న జల వనరులు**
- **వచ్చే వాన కాలంలో వరద ముప్పు ఎదుర్కోనున్న కాలనీలు**

**హుజురాబాద్, మే19 (నిఘా న్యూస్):** గత 15 సంవత్సరాలుగా హుజురాబాద్ పట్టణంలోని చెరువులు కుంటలు వాగులు కట్టు కాలువలు కబ్జాలకు గురవుతున్నాయని సంబంధిత అధికారులకు ఎప్పుడు పిర్యాదు చేసిన పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని హుజురాబాద్ లో జరుగుతున్న కబ్జాలపై. తెలిసికూడా వాటిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్నా అధికారులపై త్వరలోనే హైదరాబాద్ లోని సిఎంఓ ఆఫీస్‌లో పిర్యాదులు చేస్తానని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నడి బొడ్డులోని సర్వే నంబర్ 2477లోని గంగోని కుంట విస్తీర్ణంలో 12ఎకరాల 16గుంటలు ఉండాలని కానీ కబ్జాదారుల కోరల్లో పడి ఇప్పుడు కనీసం ఆరు ఎకరాలు కూడా లేదని సమ్మయ్య వాపోయారు. అలాగే జమ్మికుంట రోడ్డుకు ఇరువైపులా ఉన్న మాడల్ చెరువు నుండి చంద్రవోని కుంట.గుండ్ల చెరువులకు నీటిని తీసుకెళ్లే కట్టు కాలువలు పూర్తిగా కబ్జాలు ఐనాయని ఎన్నోసార్లు మున్సిపాలిటీ. ఇరిగేషన్. రెవెన్యూ శాఖ ల అధికారులకు ఫిర్యాదులు చేసిన చర్యలు శూన్యమని రాబోయే వానాకాలంలో జమ్మికుంట రోడ్డులోని పలు కాలనీలు నీట మునగడం ఖాయమని రాబోయే నీటి ముంపుకు ఫిర్యాదులు పట్టించుకోని సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని సమ్మయ్య ముదిరాజ్ డిమాండ్ చేశారు. హుజురాబాద్ పట్టంలో గంగోని కుంట శిఖం భూమి, బట్టోని కుంట, కట్టు కాలువలతో పాటు వరంగల్ రోడ్డును అనుకోని ప్రవహించే చిలుకావాగును కూడా ఇరువైపుల కబ్జాలు చేసి వాల్టా చట్టాన్ని విస్మరించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని గత నెలలో జిల్లా కలెక్టర్ కి పిర్యాదు చేశానని దానిపై హుజురాబాద్ యం పి డి ఓకి ఆదేశాలు అందినా అక్రమార్కులపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని దానికి చిలుకావాగు పక్కన యథేచ్ఛగా జరుగుతున్న నిర్మాణమే నిదర్శనమని సమ్మయ్య అన్నారు.ఇక్కడి ప్రభుత్వ అధికారులు చెరువులు కుంటలు వాగుల కట్టు కాలువల కబ్జాలను ఫిర్యాదులు ఇచ్చిన ఎందుకు పట్టించుకోవడం లేదో వాల్టా చట్టం అమలు పట్ల ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో ముఖ్యమంత్రి కార్యాలయంలో ముదిరాజ్ మహాసభ పక్షాన పిర్యాదు చేసి తేల్చుకుంటామని సమ్మయ్య ముదిరాజ్ పేర్కొన్నారు.

## తాటి చెట్లను తొలగించిన వారిపై చర్యలకు డిమాండ్



**ఆలేరు గౌడ సంఘం అధ్యక్షులు ఘనగాని శంకర్ గౌడ్**



**ఆలేరు, మే 19 (నిఘా న్యూస్):** ఆలేరు పట్టణ మున్సిపల్ కేంద్రంలోని బహదూర్ పేట గ్రామంలో సర్వేనెంబర్ 10:28 నెంబర్లు 10 తాటి చెట్టును తొలగించిన భూ యజమానిపై చర్య తీసుకోవాలని గణానిశంకర్ గౌడ్ సోమవారం పట్టణ కేంద్రంలోని రహదారి బంగ్లాలోపత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బహదూర్ పేట ఆలేరు మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు సంబంధించిన భూమిలో గల సీసా ప్రభాకర్ గౌడ్ అనే వ్యక్తి గీతా కార్మికుడు నిన్న సాయంత్రం తాళ్లు ఎక్కి వచ్చిండు. ఉదయం ఎక్కడానికి వెళ్లేసరికి చెట్లను నేలమట్టం చేశారని బాధితుడు ఆందోళన వ్యక్తపరిచారు. ఈ సంఘటన జరిగిన స్థలానికి వెళ్లి ఆరా తీశామని శంకర్ గౌడ్ అన్నారు. వెంటనే సమావేశం ఏర్పరచుకొని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎక్సైంజ్ ఆప్కారి శాఖ ప్రొబిషన్ సర్కిల్ పరిధిలోని సీఐ కి దీపికా గౌడ్ కు ఆలేరు పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ సిఐ కొండలరావుకి ఎస్సై కోమండ్ల రజనీకర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. గీత కార్మికునికి న్యాయం చేసే విధంగా స్పందించాలని లేకపోతే బిఆర్ఎస్ పార్టీ తరపున కార్మికులందరికీ రాష్ట్ర వ్యాప్తంగా గౌడ సొసైటీలు సంఘాలన్నీ కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రెక్కాడితే గాని డొక్క నిండని గీత కార్మికుడు సీస ప్రభాకర్ గౌడ్ కల్లు అమ్ముకొని జీవనోపాధి సాగిస్తున్న గీత కార్మికుని రోడ్డున కుటుంబం పడ్డారని తన నాలుగు చెట్లు పండు తాళ్లుచెట్లు కల్లు అయ్యే చెట్లను కోయడం చాలా బాధాకరమైన విషయమని శంకర్ గౌడ్ అన్నారు. గీత కార్పొరేషన్ తరపున రాష్ట్ర ప్రభుత్వం తరపున అతనికి ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఆలేర్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్ గౌడ సంఘం నాయకులు జిల్లా, మొరిగాడి వెంకటేష్ గౌడ్ సిపిఎం గీత కార్మికుల సంఘం నాయకులు ఘనగాని మల్లేశం గౌడ్ పల్లె, శ్రీనివాస్ గౌడ్ ఘనగని, కిష్టయ్య గౌడు పులివెందుల శంకరయ్య గౌడ్ జనగాం రాజు జనగాం మహేష్ గౌడ్ మిరియాల సత్తయ్య గౌడ్, మొరిగాడి రాజు గౌడ్, సిద్ధ గొని గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాటిమీది గుంపులో జీవాలపై పిడుగు

**పిడుగు పాటుతో మృతి చెందిన 21 గొర్రెలు**



**కారేపల్లి, మే 19 (నిఘా న్యూస్):** కారేపల్లి మండలం పాటిమీదిగుంపు సమీపంలో సోమవారం పిడుగు పడింది. ఈ పిడుగుపాటుకు అక్కడ ఉన్న గొర్రెలు, మేకలు మృతి చెందగా గొర్రెల కాపరికి తీవ్రగాయాల్కె ఆసుపత్రిపాల్కెంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బాజు మల్లాయిగూడెంకు చెందిన మద్దెల లక్ష్మి తమ గొర్రెలు, మేకలను పాటిమీదిగుంపు సమీపంలో మేపటానికి వెళ్లింది. సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావటంతో జీవాలు చెట్టు క్రిందకు చేరాయి. ఈ క్రమంలో చెట్టు సమీపంలో పిడుగు పడటంతో చెట్టుక్రింద ఉన్న 17 మేకలు, 4 గొర్రెలు, ఒక కుక్క మృతి చెందాయి. గొర్రెల కాపరైన మద్దెల లక్ష్మి స్పృహ తప్పి పడిపోయింది. చుట్టుపక్కల వారు చూచి గ్రామస్తులకు కబురు చేయగా వారు వచ్చి లక్ష్మిని ఖమ్మం అసుపత్రికి తరలించారు. పిడుగు పాటుతో సుమారు రూ.2 లక్షల జీవాలు మృతి చెందాయని గ్రామస్తులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం, పరిహారం ఇవ్వాలి. వ్యకాస పాటిమీదగుంపు సమీపంలో పిడుగుపాటుతో గాయాల్కెన భార్యభర్తలు మద్దెల లక్ష్మయ్య, లక్ష్మి లకు ప్రభుత్వం మెరుగైన వైద్య అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు యనమన గండ్లరవిబాబు, జీఎంపీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు పండగ కొండయ్య, దాసరి మల్లయ్యలు డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యంతో మద్దెల లక్ష్మయ్యలకు చెందిన 21 శాల్తీలు మృతువాత పడ్డాయన్నారు. జీవనాధారం కోల్పోయిన వారికి పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## బాంచన్ దొర అన్నోళ్ల చేత బందూకులు పట్టించిన యోధుడు

**కారేపల్లిలో ఘనంగా సుందరయ్య వర్ధంతి**



**కారేపల్లి, మే 19 (నిఘా న్యూస్):** నిరాడంభరతకు నిలువుదట్టం కామ్రెడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఐ(ఎం) జిల్లాకమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్రలు అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతిని కారేపల్లిలోని భాగం రామనర్సయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన బాటలో ప్రయనిస్తామని నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈసందర్బంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి దిశా నిర్దేశం చేసిన మహా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. చట్టసభలలో ప్రజల కోసం ఎలా పని చేయాలో నిరూపించి చూపిన నిరాంబర జీవి అని కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బాంచన్ దొర అన్న బక్కోడి చేత బందుకులు పట్టించి భూస్వాములు, రజాకార్లు, నిజాం సైన్యాన్ని పరిగెత్తించిన విప్లవ యోధుడు అని అన్నారు. భవిష్యత్తు తరాలకు మానవ, రాజకీయ విలువలను పోగేసిన విజ్ఞాన ఘని సుందరయ్య అని, ఆయన ఆశయ సాధన కోసం పాటుపడడమే పుచ్చలపల్లి సుందరయ్యకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు తలారి దేవ ప్రకాష్, వైరా డివిజన్ కమిటీ సభ్యులు కొండబోయిన ఉమావతి, పార్టీ శాఖ కార్యదర్శి అన్నవరపు కృష్ణ, నాయకులు పాసిన్ని నాగేశ్వరరావు, లాలు, చల్లా మల్లమ్మ, శ్రీను, రాచర్ల రణధీర్, శ్రీకాంత్, మున్నా, కరపటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## నాయకులగూడెం చెరువులో మట్టి దోపిడీ

**చెరువులు కుంటలను వదలని అక్రమాలకు పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు**



**ఇల్లందు, మే 19 (నిఘా న్యూస్):** ఇల్లందు మండలం మాడిగూడెం గ్రామ పంచాయతీ నాయకుల గూడెం చెరువును లక్ష్యంగా చేసుకొని కొందరు అక్రమార్కులు రాత్రి పగలు తేడా లేకుండా యదేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. రెండు రోజులగా చెరువులో మట్టిని ఇటుక బట్టీలకు ఇతర అవసరాలకు తోడేస్తున్న అధికారులు చూస్తూ ఉండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్త పరిచారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న మట్టి మాఫియాపై చర్యలు తీసుకోక పోవడంపై మండలంలో చర్చనియాంశంగా మారింది.మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారుల జాడ లేక పోవడంతో మట్టి విక్రయాలు జరుపుతూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారు.ఈ మట్టి మాఫియా అక్రమాలను అరికట్టకపోతే చెరువులు, కుంటలు మాయమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆరోపించారు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరారు.

## టిమ్స్ ఆసుపత్రి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

**ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలి : జిల్లా కలెక్టర్ గౌతమ్**



**శామీర్‌పేట, మే 19 (నిఘా న్యూస్):** టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులలో ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పనులలో తత్సారం ఉండకూడదని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, సంబంధిత అధికారులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం సూచించారు. సోమవారం అల్వాల్‌లోని టిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షా సమావేశానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులలో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అన్నారు. అసుపత్రి పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంబంధిత కాంట్రాక్టరు కలెక్టరు వివరించారు. 90శాతం పనులు పూర్తయ్యాయని ఇంకొకరెండు నెలలో మిగిత నిర్మాణ పనులు పూర్తవుతాయని, కొన్ని చోట్లరీ డిజైన్ వలన కొంత అదనపు నిధులు అవసరమవుతున్నాయని కాంట్రాక్టర్ కలెక్టరుకు వివరించారు. చట్టబద్ధమైన ఆమోదాలు అటవీ శాఖ, ఎఎఐ, పర్యావరణ అనుమతి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నిర్మాణానికి (ఎన్ ఓ సి) జారీ, నిర్మాణం కోసం విద్యుత్, నీటి కనెక్షన్ పొందబడింది. కాలుష్య నియంత్రణ బోర్డు స్థాపనకు సమ్మతిని జారీ చేసిందని సంబంధిత అధికారులు కలెక్టరుకు వివరించారు. అదేవిధంగాఈ ఆసుపత్రిలో టీచింగ్ ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీలు కూడా నిర్మించడం జరుగుతుందని తెలిపారు.

ఆసుపత్రిలో ఫర్నిచర్ ఏవిధంగా అందిస్తారని కలెక్టరు అడుడగా, అధునాతన పరికరాలైన మెడికల్ ఎక్విప్ మెంట్, ఆపరేషన్ థియేటర్లు నిర్మించేందుకు అగ్రిమెంట్‌లో ఒప్పందం జరిగిందని అదేవిధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని అధికారులు వివరించారు. కొన్ని అంశాలకు అవసరమైన డిఎంఎ అనుమతుల విషయంలో కలెక్టరు సంబంధిత అధికారులతో మాట్లాడుతానని కలెక్టరు తెలిపారు. ఎప్పటివరకు ఆసుపత్రి పనులు పూర్తి చేసి అప్పగిస్తారని కలెక్టరు అడుడగా, డిసంబరు 2025 నాటికి పూర్తి చేసి అప్పగిస్తామని కాంట్రాక్టరు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బిఈఈ వనజ, ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డిఎంఅండ్ హెచ్ఓ ఉమాగౌరీ, అల్వాల్ తహాసీల్దారు రాములు, కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తంగేళ్లపల్లి - వెంకిర్యాల వాగు బ్రిడ్జికి మోక్షం

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం**



**షాద్‌నగర్, మే 19(నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని కొందుర్గు నుండి నవాబ్ పేట్ వెళ్లే రోడ్డు మధ్యలో తంగేళ్లపల్లి వెంకిర్యాల మధ్యలో గల వాగు వంతెన పనులను త్వరలో తిరిగి ప్రారంభించబోతున్నట్లు ఆర్అండ్‌బి ఈఈ రవీందర్ తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయా గ్రామ ప్రజలతో కలిసి సోమవారం వంతెనను పరిశీలించడం జరిగింది. ఎన్నో రోజుల నుండి కొందుర్గు నుండి నవాబ్ పేట్ మహబూబ్ నగర్ వెళ్లే వాహనదారులు, స్థానిక మండల ప్రజల కష్టాలను చూసి చలించిన ఎమ్మెల్యే శంకర్ కాంట్రాక్టర్‌కు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించడంతోపాటు వ్యక్తిగతంగా నిర్మాణానికి అవసరమయ్యే సామాగ్రిని కూడా సమకూరుస్తానని హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గానికి ఇటువంటి శాసనసభ్యులు ఉండడం నియోజకవర్గ ప్రజల అదృష్టం అని మండల యువ నాయకుడు జితేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com